మంగళవారం 24 సెప్టెంబర్ 2024
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో
టీడీపీ నేతలకు
పిన్నెల్లి బాధితుడి గోడు
9

పీపీపీ విధానంలో
రోడ్ల అభివృద్ధిపై అధ్యయనం
- గుజరాత్ వెళ్లిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, అధికారులు
12

విభిన్న ప్రతిభావంతుల విషయంలో ప్రభుత్వానిది మానవీయ కోణం. అందుకే అధికారం చేపట్టిన తొలి నెలలోనే పింఛన్ రూ.3వేల నుంచి ఒకేసారి రూ.6 వేలకు పెంచాం. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైనవారికి దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.15 వేలు ప్రతినెలా పింఛను ఇస్తున్నాం. అనర్హులు దివ్యాంగుల పేరుతో పింఛను పొందడమంటే అర్హులకు అన్యాయం చేయడమే. నిజమైన లబ్ధిదారులకు సాయం విషయంలో రాజీపడబోను. ఇదే సమయంలో బోగస్ పింఛన్లు కూడా కొనసాగించేది లేదు. దీనిపై అధికారులు ఓ కార్యాచరణ సిద్ధం చేయండి.

## చేనేతలకు జిఎస్టీ రీయింబర్స్‌మెంట్

చేనేత, హస్తకళల రంగంలో ఉన్నవారి అభివృద్ధికి వినూత్న విధానాలు అమలు చేసే యోచన ఉంది. మారుతున్న కాలానికి అనుగణంగా ఉత్పత్తుల తయారీలో మార్పులు చేపట్టి చేనేత, హస్త కళాకారుల ఆదాయం పెంచే మార్గాలు అమలు చేస్తాం. ఉత్పత్తుల ఆధునీకరణ, టెక్నాలజీ వాడకం, మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా చేనేత, హస్తకళాకారుల ఉత్పత్తులకు డిమాండ్ పెంచితే.. ఆయా వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. త్వరలో కొత్త టెక్స్‌టైల్ పాలసీ తేనున్నాం. నిపుణులు, కన్సల్టెన్సీ ద్వారా చేనేత, హస్తకళలలో ఆవిష్కరణలను ప్రోత్సహించాలి.

3



## మైనారిటీలకు మరింత మేలుజరిగేలా..

ముస్లిం మైనారిటీ వర్గాలకు అందిస్తోన్న సంక్షేమ పథకాలను వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా.. ఆయా వర్గాలకు మరింత మేలు జరిగేలా రీస్ట్రక్చర్ చేయాలి. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద మంజూరైన రూ.447 కోట్లతో.. పెండింగ్ పనుల పూర్తికి అధికారులు సన్నాహాలు చేయండి. మైనారిటీ విభాగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు శిక్షణ సంస్థలు ఏపీలో ఏర్పాటు చేసే అంశాన్నీ లోతుగా అధ్యయనం చేయండి. వక్ఫ్ భూముల అభివృద్ధితోపాటు.. ఆదాయ ఫలాలు ఆయా వర్గాలకే అందేలా చూడాలి. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేద్దాం.

3

## కర్నూలుకు హైకోర్టు బెంచ్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మంత్రిమండలిలో ఈమేరకు ఒక తీర్మానం చేసి.. కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతాం. రాజధాని అమరావతిలో 100 ఎకరాల విస్తీర్ణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా అంతర్జాతీయస్థాయి న్యాయ కళాశాల ఏర్పాటు అంశాన్ని ముందుకు తీసుకెళ్తాం. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టుగా జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం అందించే ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తాం. ప్రభుత్వ ప్రాసిక్యూషన్ విభాగం మరింత పదునుదేలాలి.

- దివ్యాంగులపట్ల ప్రభుత్వానిది మానవతాకోణం
- దీర్ఘకాల అనారోగ్యమైతే.. పింఛను రూ.15వేలు
- దేశంలో ఎక్కడాలేని సంక్షేమ సహాయమిది..
- ప్రతి అర్హుడికీ పింఛను ఇవ్వాలన్నదే లక్ష్యం
- అందుకు, అనర్హులు పింఛన్లు వదులుకోవాలి
- వృద్ధుల జీవన ప్రమాణాల పెంపునకు డిజిటల్ లిటరసీ
- విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై సమీక్షలో చంద్రబాబు

# అందుకే.. పింఛను డబుల్

2 లో



రాష్ట్రంలో యూనివర్సిటీల నుంచి బయటకొచ్చే...

# ప్రతి విద్యార్థికి ఉద్యోగం రావాలి

- అందుకు తగ్గట్టుగా వచ్చే విద్యాసంవత్సరం నుంచే కరిక్యులమ్‌లో మార్పులు
- ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వర్సిటీల్లో బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటు
- ఉన్నత విద్యశాఖపై సమీక్షలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



- వివరాలు 4 లో..

# ఫస్ట్ టార్గెట్.. హంద్రీ-నీవా!

- ప్రాజెక్టు పనుల పూర్తికి సత్వర చర్యలు
- కుప్పం చివరి ఆయకట్టు వరకూ సాగు జలాలు
- ఇక.. సీమ ప్రాజెక్టులు పరిగెత్తిస్తాం..
- సీఎం కలల రతనాల సీమ ఆవిష్కరిస్తాం
- మాదనపల్లి, యామిగానిపల్లి పనులకు అంచనాలు రెడీ
- వంద రోజుల పాలనలో పెన్షన్ పెంపు పూర్తిగా అమలు
- దీపావళి కాన్కగా ఉచిత గ్యాస్ పంపిణీకి సర్కారు చర్యలు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



2 లో



35వ రోజు మంత్రి నారా లోకేష్

## "ప్రజాదర్బార్"కు విన్నపాల వెల్లువ

- అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చిన మంత్రి

- వివరాలు 5 లో..

మంగళగిరి, సీఆర్డీయే ప్రాంతంలో

## పైలెట్ ప్రాజెక్ట్‌గా నైపుణ్య గణన

- అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశం
- నైపుణ్యాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష

- వివరాలు 4 లో..

శ్రీవారి ఆస్తుల పరిరక్షణ

## కూటమి ప్రభుత్వ బాధ్యత

- ఆస్తుల వివరాలు, ఆభరణాల లెక్కలు పరిశీలించాలి
- శ్రీవాణి ట్రస్ట్ ఆదాయం ఎటు మళ్లించారు?
- సమగ్ర విచారణ జరిపించాలి
- దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆస్తులను సమీక్షించాలి
- సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ వినతి

10



# అందుకే.. పింఛను డబుల్

- దివ్యాంగులపట్ల ప్రభుత్వానిది మానవతాకోణం
- దీర్ఘకాల అనారోగ్యమైతే.. పింఛను రూ.15వేలు
- దేశంలో ఎక్కడాలేని సంక్షేమ సహాయమిది..
- ప్రతి అర్హుడికీ పెంఛను ఇవ్వాలన్నదే లక్ష్యం
- అందుకు, అనర్హులు పెంఛన్లు వదులుకోవాలి
- వృద్ధుల జీవన ప్రమాణాల పెంపునకు డిజిటల్ లిటరసీ
- విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై సమీక్షలో చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): విభిన్న ప్రతిభావంతుల విషయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దివ్యాంగులను ప్రత్యేకంగా చూడాల్సిన అవసరముందన్న కారణంతో అధికారం చేపట్టిన తొలి నెలలోనే పింఛన్ రూ. 3వేల నుంచి ఒకేసారి రూ.6 వేలకు పెంచామన్నారు. అదేవిధంగా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైనవారికి దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.15 వేలు ప్రతినెలా పింఛను రూపంలో ఇస్తున్నామన్నారు. అర్హులెవ్వరికీ పింఛను అందడం లేదన్న బాధ ఉండకూదదని, ముఖ్యంగా దివ్యాంగుల విషయంలో ప్రతి ఒక్క అర్హుడికీ పింఛన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తప్పుడు సర్టిఫికేట్లతో దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందిన ఘటనలు ఉన్నాయని.. ఈ విషయంలో పెద్దఎత్తున ఫిర్యాదులు ఉన్నాయని వివరించారు. ఈ అంశంపై తనవద్దా స్పష్టమైన సమాచారం ఉందని సీఎం చంద్రబాబు అంటూ.. అర్హులకు, బాధితులకు పింఛన్ ఇవ్వాలన్న తమ విధానాన్ని దుర్వినియోగం చేసి.. పింఛన్లు పొందడం సరికాదన్నారు. వైద్యుల నుంచి తప్పుడు సర్టిఫికెట్లతో కొంతమంది దివ్యాంగుల పేరుతో పింఛన్లు తీసుకోవడాన్ని అరికట్టాలని ఆదేశించారు. అనర్హులు ఎవరైనా తప్పుడు పద్ధతిలో పింఛన్‌లు పొందుతుంటే స్వచ్ఛందంగా వదులుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పింఛన్ల అంశంలో ప్రత్యేకంగా గ్రామసభలు పెట్టి అర్హులకు పింఛన్లు ఇవ్వడంతో పాటు... అనర్హులను తొలగించాల్సిన అవసరముందన్నారు. దీనిపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశాలిచ్చారు. అనర్హులు దివ్యాంగుల పేరుతో పింఛను పొందడం అంటే అర్హులకు అన్యాయం చేయడమే అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిజమైన లబ్ధిదారులకు సాయం చేసే విషయంలో రాజీపడబోదని... ఇదే సమయంలో బోగస్ పింఛన్లు కూడా కొనసాగించేది లేదని సీఎం అన్నారు.

## సీనియర్స్ సిటిజన్స్‌కు డిజిటల్ లిట్రసీ

గ్రామాల్లో ఉండే వృద్ధులకు పింఛన్ ఇవ్వడంతో పాటు.... వారికి ఇతరత్రా ఏం చెయ్యవచ్చనేది కూడా స్టడీ చేయాలని సీఎం అధికారులకు సూచించారు. గ్రామాల్లో వృద్ధులకు డిజిటల్ లిట్రసీ ద్వారా వారు సులభంగా సేవలుపొందే అవకాశాన్ని కల్పించాలన్నారు. దీనికోసం వృద్ధులు, ఆయా ఏజెన్సీలతో మాట్లాడి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 39 లక్షల మంది సీనియర్ సిటిజన్స్‌కు పింఛన్లు ఇస్తున్నామని... వారికి గ్రామాల్లో అవకాశాలు సృష్టించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పింఛన్లతో సోషల్ సెక్యూరిటీతో పాటు గౌరవం ఇచ్చామన్నారు. వృద్ధులకు పింఛన్ ఇచ్చి వదిలేయడం కాకుండా వారి జీవన ప్రమాణాలను ఎలా పెంచవచ్చనే విషయంలో ఆలోచనలు చేసి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దివ్యాంగుల కోసం స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటుకు విశాఖలో 30 ఎకరాలు కేటాయించాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.200 కోట్లతో ఈ సెంటర్ మంజూరు చేసిందని... అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు జరగలేదని, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని సీఎం అన్నారు. సింగిల్‌గా ఉండే ట్రాన్స్‌జెండర్స్‌కు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. పిల్లల్లో చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు కనిపెట్టేందుకు పరీక్షలు చేయాలని.... ఇలాంటి కార్యక్రమం సమర్థవంతంగా చేపడితే వారు భవిష్యత్‌లో దివ్యాంగులు అవ్వకుండా అరికట్టవచ్చని సూచించారు. దీనికోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. దివ్యాంగులకు ఇచ్చే వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ సోలార్ సిస్టంతో నడిచే విధంగా రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# ఫస్ట్ టార్గెట్.. హంద్రీ-నీవా!

- ప్రాజెక్టు పనుల పూర్తికి సత్వర చర్యలు
- కుప్పం చివరి ఆయకట్టు వరకూ సాగు జలాలు
- ఇక.. సీమ ప్రాజెక్టులు పరిగెత్తిస్తాం..
- సీఎం కలల రతనాల సీమ ఆవిష్కరిస్తాం
- మాదనపల్లి, యామిగానిపల్లి పనులకు అంచనాలు రెడీ
- పంద రోజుల పాలనలో పెన్షన్ పెంపు పూర్తిగా అమలు
- దీపావళి కాన్కగా ఉచిత గ్యాస్ పంపిణీకి సర్కారు చర్యలు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



కుప్పం (చైతన్య రథం): రాయలసీమను రతనాల సీమ చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనలో భాగంగా హంద్రీ- నీవా, గాలేరు- నగరి, తెలుగుగంగ జలాలు త్వరలోనే అందించే ఏర్పాటు చేస్తామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. హంద్రీ- నీవా ప్రాజెక్టు పనుల పరిశీలనలో భాగంగా మంత్రి నిమ్మల మూడురోజులపాటు సీమలో పర్యటించారు. సోమవారం చిత్తూరు జిల్లాలో హంద్రీ-నీవా పనుల పరిశీలన అనంతరం కుప్పం రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో మీడియాతో మాట్లాదారు.

తెలుగుగంగ, హంద్రీ- నీవా, గాలేరు- నగరి ప్రాజెక్టుల ముఖ్యోద్దేశం సీమను బంగరు ప్రాంతంగా తీర్చిదిద్దడానికే అన్నారు. గత ఐదేళ్ల పాలనా కాలంలో ఇరిగేషన్ శాఖ వైఫల్యం, నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనుకపడిందన్నారు. 2014-19 సమయంలో రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.7 లక్షల కోట్లయితే.. అందులో 9.9 శాతం రూ.72 వేల కోట్లు ఇరిగేషన్‌కు కేటాయించిన విషయాన్ని మంత్రి నిమ్మల గుర్తు చేశారు. 2019- 24 సమయంలో రాష్ట్రబడ్జెట్ రూ.12 లక్షల కోట్లయితే.. అందులో ఇరిగేషన్ శాఖకు రూ.49వేల కోట్లు కేటాయించారని, అందులోనూ రూ.31 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారన్నారు. మునుపటి చంద్రబాబు ప్రభుత్వంలో ఒక్క రాయలసీమలోనే ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ.12 వేల కోట్లు వెచ్చిస్తే.. 2019-24లో వైసీపీ పాలకులు కేవలం రూ.2.2 వేల కోట్లు ఖర్చుచేసి తమ చేతగానితనాన్ని నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. 2014-19లో హంద్రీ -నీవా కాల్వ పనులకు రూ.4 వేల కోట్లు వెచ్చిస్తే.. 2019-24లో కేవలం రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్టు తాజా లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాయలసీమకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాయలసీమలో చివరి ఆయకట్టు వరకు జలాలు అందించి.. ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రజానీకానికి తాగు నీరు అందించడమే జలవనరుల శాఖ ప్రత్యేక అజెండాగా నిర్ధారించుకున్నామని మంత్రి నిమ్మల తమ లక్ష్యాలను వివరించారు. ఇందులోభాగంగా రాయలసీమలో గత రెండు రోజులుగా హంద్రీ -నీవా ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తూ.. ప్రస్తుతం కుప్పం వరకూ వచ్చినట్లు పేర్కొన్నారు. హంద్రీ -నీవా ప్రాజెక్ట్ 4 జిల్లాల్లో ప్రవహింపచేసి.. సాగునీరు, తాగునీరు అందించడమే కాదు.. 3,250 క్యూసెక్కుల జలాలు సరఫరాకు పంపులు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వస్తుతం ప్రాజెక్ట్‌లో 1800 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. కుప్పం మెయిన్ కెనాల్ 402 కి.మీ నిడివి, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ 207 కి.మీలు, కుప్పం బ్రాంచ్ కెనాల్ 123 కి.మీల నిడివి.. మొత్తం 730 కి.మీ నీరు ప్రవహించి కుప్పంకు నీరు రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి కాల్వల విస్తరణ, , సాయిల్ లీకేజీ నియంత్రణకు లైనింగ్ పనులుచేపట్టి రానున్న సీజన్‌లో 3,850 క్యూసెక్కుల నీరు అందించే ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నిమ్మల వివరించారు.

చిప్పిలి, గుంటవారిపల్లి రిజర్వాయర్లు మదనపల్లికు నీరు అందించడానికి నిర్దేశించారని, 2014-19లో 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌తో పాటు కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తిచేసి కుప్పం బ్రాంచ్ కెనాల్ ఆయకట్టులోని చిట్టచివరి పాయింట్ పరమసముద్రం వరకు నీరిచ్చి కుప్పం నియోజకవర్గ పరిధిలో 110 చెరువులను నీటితో నింపి సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. దీంతోపాటు మదనపల్లి, యామిగానిపల్లి వద్ద రూ.535 కోట్లతో రిజర్వాయర్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి పంపడం జరుగుతుందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో అమలులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో పెన్షన్‌ను రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచి పెరిగిన పెన్షన్‌ను అరియర్స్‌సహా రూ.7 వేలు అందించామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు రూ.3 వేల నుండి రూ.6 వేలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు రూ.10 వేలు, రూ.15 వేలు అందించామన్నారు. పెన్షన్‌ను ప్రతినెలా 1న సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో లబ్ధిదారుని ఇంటివద్దకు వెళ్లి ఇవ్వడం జరుగుతోందని, ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లి పెన్షన్ అందిస్తోన్న విషయాన్ని మంత్రి నిమ్మల గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనపై దృష్టిపెట్టి చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి తొలి సంతకం డీఎస్సీపై చేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీనీ ప్రభుత్వం అమలు చేస్తోందని, దీపావళినాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, హెచ్ఎన్ఎస్ఎస్ఎ ఎస్ఈ వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు మునిరత్నం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీలకు మేలుజరిగేలా..!

- సంక్షేమ పథకాల రూపకల్పనకు ఆదేశాలు..
- కడప హజ్‌హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్ పూర్తికి ఆదేశం
- నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం
- ఇమామ్, మౌజన్‌లకు త్వరలో గౌరవ వేతనాలు
- మైనారిటీలకు లబ్ది చేకూరేలా వక్ఫ్ భూముల అభివృద్ధి
- మైనారిటీ సంక్షేమశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): ముస్లిం మైనారిటీ వర్గాలకు అందిస్తోన్న సంక్షేమ పథకాలను మరింత మేలు జరిగేలా.. వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా రూపకల్పన సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు, ఎన్నికల్లో ప్రకటించిన హామీల నేపథ్యంలో... ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ఆయా పథకాల రూపకల్పన సాగాలని సీఎం ఆదేశించారు. మైనారిటీ సంక్షేమంపై ముఖ్య మంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద మంజూరైన రూ.447 కోట్లకు సంబంధించి పెండింగులోవున్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరై కొంతమేర నిర్మాణాలు జరిగిన షాదీ ఖానాలు, ఇతర నిర్మాణాలు పూర్తి చెయ్యాలన్నారు. ప్రారంభంకాని పనులను రద్దుచేసి పునఃసమీక్షించాలని సూచించారు. కడపలో హజ్‌హౌస్‌కు నాడు తెలుగుదేశం ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసి 80శాతంమేర నిర్మాణం పూర్తి చేసిందని అధికారులు తెలిపారు. ఆ నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని సీఎం సూచించారు. మైనారిటీ విభాగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు శిక్షణ సంస్థలు ఏపీలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. గుంటూరు క్రిస్టియన్ భవన్‌కు నాడు తెలుగుదేశం ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేస్తే, 50 శాతం పనులు పూర్తైనట్టు అధికారులు వివరించగా.. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వక్ఫ్ బోర్డు భూముల సర్వే రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వక్ఫ్‌బోర్డ్ భూముల అభివృద్ధికి అధికారులు చేసిన ప్రతిపాదనలకు సీఎం అంగీకారం తెలిపారు. వక్ఫ్ బోర్డు భూములను అభివృద్ధి చేయాలని... అందులో ఆ వర్గానికి చెందిన వారే భాగస్వాములుగా ఉండేలా చూడాలన్నారు. వక్ఫ్ బోర్డుకు ఆదాయం తీసుకురావడంతో పాటు.... భూముల అభివృద్ధి ఫలాలు ఆ వర్గాలకే అందేలా చూడాలన్నారు. అదేవిధంగా నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం అంగీకరించారు. మత కార్యక్రమాల్లో ప్రభుత్వ శాఖలు అనవసర జోక్యం చేసుకోవద్దని... వారి గౌరవాలకు భంగం కలగకుండా ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం సూచించారు. ఇమామ్, మౌజన్‌లకు నెలకు గౌరవ వేతనం కింద రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామన్న హామీని త్వరలో అమల్లోకి తేవాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. అర్హతవున్న ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించాలని సీఎం తెలిపారు. మసీదుల నిర్వహణకు రూ.5 వేలు ఆర్థిక సాయం, హజ్‌యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష సాయం ఇచ్చే కార్యక్రమాలకు కూడా శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారు. మైనారిటీలకు స్మశాన వాటికల స్థలం కేటాయింపు కోసం జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ ఎండి ఫరూక్, అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలుకు హైకోర్టు బెంచ్

- కేబినెట్‌లో తీర్మానించి కేంద్రానికి పంపుతాం
- అమరావతిలో అంతర్జాతీయస్థాయి లా కళాశాల
- 100 ఎకరాల్లో ఏర్పాటుపై అధ్యయనం చేయండి
- జేపీలకు త్వరలోనే రూ.10వేలు గౌరవ వేతనం
- ప్రాసిక్యూషన్ మరింత పదునుదేలాలి..
- న్యాయశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్యరథం): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వంనుంచి కేంద్రానికి పంపుతామని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రి వర్గ సమావేశంలో ఈమేరకు తీర్మానంచేసి కేంద్రానికి పంపుతామన్నారు. సోమవారం సచివాలయంలో న్యాయశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతిలో 100 ఎకరాల విస్తీర్ణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఇంటర్నేషన్ లా స్కూల్ ఏర్పాటును ముందుకు తీసుకువెళ్లాలని సీఎం సూచించారు. బెంగుళూరుకు చెందిన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లాంటి ప్రతిష్టాత్మక సంస్థల తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ ఇనిస్టిట్యూట్‌ను అమరావతిలో ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

అదే విధంగా జూనియర్ న్యాయవాదులకు నెలకు గౌరవ వేతనంగా రూ.10 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పామని... ఆమేరకు చెల్లించేందుకు ప్రక్రియ ప్రారంభించాలని సీఎం అధికారులకు సూచించారు. జూనియర్ న్యాయ వాదులకు శిక్షణ కేంద్రం కోసం అకాడమీ ఏర్పాటు అంశంపైనా కసరత్తు చేయాలన్నారు. అనంతరం ప్రాసిక్యూషన్ విభాగంపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. నమోదైన కేసులు, రుజువైన నేరాల అంశంలో శిక్షపడే శాతం పెరగాలని... దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసే పద్ధతులను అవలంభించాలని సీఎం సూచించారు. తప్పుచేసిన వారికి శిక్ష పడుతుందనే నమ్మకం కలిగేలా ప్రాసిక్యూషన్ ఉండాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడే విషయంలో లిటిగేషన్లు పెట్టాలే కానీ... అనవసర వివాదాలు తెచ్చేలా లిటిగేషన్ ప్రభుత్వం నుంచి ఉండకూడదని సీఎం వ్యాఖ్యానించారు. న్యాయశాఖపై మరింత సమగ్రంగా సమీక్ష చేయాల్సి ఉందన్న ముఖ్యమంత్రి... మరిన్ని వివరాలతో రావాలని అధికారులను ఆదేశించారు.

## చేనేతలకు.. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్



- పీఎం సూర్యఘర్‌తో మగ్గాలున్న వారికి ఉచిత విద్యుత్
- త్వరలోనే నూతన టెక్స్‌టైల్స్ పాలసీ..
- మంచి మార్కెట్ కోసం.. రిటైల్ చైన్‌లతో జతకట్టండి
- త్వరలోనే ఆరోగ్య బీమా సైతం అమలు చేస్తాం..
- చేనేత, హస్తకళలపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): చేనేత, హస్తకళల రంగంలో ఉన్నవారి అభివృద్ధికి వినూత్న విధానాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మారుతున్న కాలానికి అనుగణంగా ఉత్పత్తుల తయారీలో మార్పులు చేపట్టి చేనేత, హస్త కళాకారుల ఆదాయం పెంచే మార్గాలు అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి దాదాపు రెండేళ్లపాటు చేనేత, జౌళి, హస్తకళలపై కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ శాఖలో పరిస్థితులు, స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమగ్ర సమీక్ష చేశారు. 35 చేనేత, 36 హస్తకళల క్లస్టర్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఉత్పత్తుల ఆధునీకరణ, టెక్నాలజీ వాడకం, మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా చేనేత, హస్తకళాకారుల ఉత్పత్తులకు డిమాండ్ పెంచవచ్చని... తద్వారా ఆయా వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని సీఎం అన్నారు. త్వరలో కొత్త టెక్స్‌టైల్ పాలసీ తెస్తామని సీఎం ప్రకటించారు. నిపుణులు, కన్సల్టెన్సీ ద్వారా చేనేత, హస్తకళలలో ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నారు. చేనేత ఉత్పత్తులను సమర్థవంతంగా మార్కెట్ చేయడానికి ఈ-కామర్స్, రిటైల్ చైన్‌లతో జతకట్టాలని సూచించారు. చేనేత ఉత్పత్తులపై కేంద్రం జీఎస్టీని రద్దు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమలు చేసి చేనేత మగ్గాలున్నవారికి 200 యూనిట్లు, మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా ఇప్పటికే ప్రకటించినట్లు నేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకం త్వరలో అందుబాటులోకి తెస్తామని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.



### 1న అలిపిరి మెట్ల మార్గం ద్వారా

# తిరుమలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- 2వ తేదీన శ్రీవారిని దర్శించుకుని ప్రాయశ్చిత్త దీక్ష విరమణ
- 3న తిరుపతిలో వారాహి సభ

అమరావతి(చైతన్యరథం): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను తిరుమలలో అక్టోబర్ 2వ తేదీన విరమిస్తారు. ఇందులో భాగంగా అక్టోబర్ 1వ తేదీన తిరుపతికి చేరుకొని అలిపిరి మెట్ల మార్గం ద్వారా నడుచుకొంటూ తిరుమలకు చేరుకుంటారు. 2వ తేదీ ఉదయం స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం ప్రాయశ్చిత్త దీక్షను విరమిస్తారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేసిన విషయం వెలుగులోకి వచ్చిన దరిమిలా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన సంగతి విదితమే. సోమవారానికి దీక్ష రెండో రోజుకు చేరుకుంది. 11 రోజుల దీక్షను తిరుమల ఏడుకొండల స్వామిని దర్శించుకొని విరమిస్తారు. 2వ తేదీన తిరుమల కొండపై ఉంటారు. 3వ తేదీన తిరుపతిలో వారాహి సభను నిర్వహించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నారు.



## రాష్ట్రంలో యూనివర్సిటీల నుంచి బయటకొచ్చే...

# ప్రతి విద్యార్థికి ఉద్యోగం రావాలి

- అందుకు తగ్గట్టుగా వచ్చే విద్యాసంవత్సరం నుంచే కరిక్యులమ్‌లో మార్పులు
- ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వర్సిటీల్లో బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటు
- ఉన్నత విద్యశాఖపై సమీక్షలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి(చైతన్యరథం):ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల నుంచి చదువు పూర్తిచేసుకొని బయటకు వచ్చేసరికి ప్రతి విద్యార్థికి ఉద్యోగం సిద్ధంగా ఉండాలని.ఇందుకు తగ్గట్లుగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి కరిక్యులమ్‌లో మార్పులు చేయాలని అధికారులను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. రాష్ట్ర ఉన్నతవిద్యశాఖ అధికారులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విద్యార్థులు ఆయా కళాశాలల్లో చదువుకునేటప్పుడే ప్రస్తుత మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వాలని, బయట మళ్లీ శిక్షణ తీసుకునే పరిస్థితులు ఉండకూడదని స్పష్టం చేశారు. కంప్యూటర్ సైన్స్, మెకానికల్ వంటి వాటితోపాటు సివిల్స్ శిక్షణ కూడా అంతర్భాగం చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు.పరిశ్రమ పెద్దలతో చర్చించి వారి అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాలని అన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీలు వెనుకబడి ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. ర్యాంకింగ్స్ మెరుగుదలకు విద్యారంగ నిపుణుల సలహాలు తీసుకోవాలని అన్నారు. 2027నాటికి మెరుగైన ర్యాంకింగ్ కోసం ప్రతి యూనివర్సిటీకి లక్ష్యాన్ని నిర్దేశించాలని, ఆంధ్రా, ఆచార్య నాగార్జున వర్సిటీలు టాప్-10లో ఉండాలన్నారు. రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీల్లో విద్యనభ్యసించి కీలకస్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థుల్లో ప్రముఖులతో వెబ్ సైట్ రూపొందించి ఆయా వర్సిటీలకు బ్రాండింగ్ కల్పించాలని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో చదివిన జోషి పిటిఐ ఛైర్మన్‌గా పనిచేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అవసరమైతే ఆయా వర్సిటీల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రముఖులతో తాను ప్రత్యేకంగా సమావేశమవుతానని చెప్పారు. 2030, 2047 నాటికి యూనివర్సిటీల్లో ప్రమాణాల మెరుగుకు లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. రాష్ట్రంలో చదువుకున్న ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అపార్ ఐడి ఏర్పాటుచేసి డిజి లాకర్ ఇవ్వాలని తెలిపారు. డిజి లాకర్ సమాచారాన్ని డ్యాష్ బోర్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇటీవల వరదల్లో సర్టిఫికెట్లు కోల్పోయిన విద్యార్థులకు తక్షణం కొత్తవి జారీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో సర్టిఫికెట్ల కోసం యూనివర్సిటీలకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో డిజి లాకర్స్ సిద్ధం చేయాలన్నారు. ఎపిపిఎస్‌సి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఎక్కువ సమయం పడుతోందని, రాబోయే రోజుల్లో డిజి లాకర్స్‌ను ఎఐతో అనుసంధానించడం ద్వారా సులభంగా సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయవచ్చని మంత్రి లోకేష్ చెప్పారు.

### సీఎం దృష్టికి విదేశీ విద్య బకాయిలు

గత ప్రభుత్వం రూ.2473 కోట్ల రూపాయల పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ లను బకాయి పెట్టి వెళ్లిందని మంత్రి లోకేష్ దృష్టికి అధికారులు తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో విదేశీ విద్య బకాయిలు ఏ మేర ఉన్నాయని వాకబుచేయగా, రూ.89కోట్ల మేర ఉన్నాయని అధికారులు సమాధానమిచ్చారు. ఈ బకాయిలను ఏవిధంగా చెల్లించాలనే విషయమై మంగళవారం నాడు జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ ఎఐ యూనివర్సిటీతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు రూట్ మ్యాప్ సిద్ధంచేయాలన్నారు. ప్రభుత్వం అందించే అన్ని పౌర సేవలు వాట్సప్‌తో సహా వివిధ మాధ్యమాల ద్వారా ఫోన్లో పొందే సదుపాయం కల్పించాలని ఆదేశించారు. అలాగే వచ్చే ఏడాది నుండి జరిగే అన్ని ప్రవేశ పరీక్షల కౌన్సిలింగ్ ప్రక్రియను సులభతరం చెయ్యాలని సూచించారు. ఉన్నత విద్య అభ్యసించే ప్రతి విద్యార్థికి స్టూడెంట్ యాప్ ద్వారా సమాచారం, సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇంటర్ వర్సిటీ స్పోర్ట్స్ కాంపిటీషన్స్ నిర్వహణ,స్పోర్ట్స్ యూనివర్సిటీ కాన్సెప్ట్‌ను సిద్ధం చేయాలని సూచించారు. రీసెర్చ్ అండ్ ఇన్నొవేషన్, ఇన్నొవేషన్ పాస్‌పోర్టు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకానికి వస్తున్న దరఖాస్తులు, పారిశ్రామికవేత్తలతో వర్సిటీల బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటు వంటి అంశాలపై అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్‌కుమార్, హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ కె.రామ్మోహన్ రావు, కెపిఎంజి ప్రతినిధులు కుమార పురుషోత్తం, ఇమ్మని మోహన్ పాల్గొన్నారు.

---

## మంగళగిరి, సీఆర్డీయే ప్రాంతంలో...

# పైలెట్ ప్రాజెక్ట్‌గా నైపుణ్య గణన

- అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశం
- నైపుణ్యాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష
- స్కిల్ సెన్సెస్, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీల్లో ఉద్యోగాల కల్పన, నైపుణ్యశిక్షణపై చర్చ
- నియోజకవర్గాల వారీగా ప్రతి నెలా జాబ్‌మేళా క్యాలెండర్ ఇవ్వాలి
- ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ కార్యాలయాలపై నివేదికకు ఆదేశం



అమరావతి(చైతన్యరథం): నైపుణ్య గణన కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా మంగళగిరి,సీఆర్డీయే ప్రాంతాల్లో తొలుత చేపట్టాలని అధికారులను విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి నారా లోకేష్ సోమవారం సమీక్ష నిర్వహించారు. మంగళవారం సంబంధిత శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమీక్ష ఉన్నందున ఉండవల్లిలోని నివాసంలో ముందస్తుగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి శాఖ చేపడుతున్న అనేక కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. స్కిల్ సెన్సెస్ యాప్ పై చర్చించిన మంత్రి లోకేష్ పైలెట్ ప్రాజెక్టు కింద మంగళగిరి, సీఆర్డీయే ప్రాంతాల్లో నైపుణ్యగణన చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల అనుసంధాన ప్రక్రియ ఎంతవరకు వచ్చిందన్న అంశంపై సమావేశంలో చర్చించారు. ఐటీఐ కాలేజీల్లో ఉద్యోగాల కల్పన, శిక్షణపైనా చర్చించారు. నియోజకవర్గాల వారీగా ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహణకై క్యాలెండర్ రూపొందించాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఉన్న ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయాలపై సమగ్ర నోట్ సమర్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డ్యాష్ బోర్డు రూపకల్పన, స్కిల్ యూనివర్సిటీ అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీ సౌరభ్ గౌర్, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సీఈవో జి.గణేష్ కుమార్, కేపీఎంజీ(పీఎంయూ, ఏపీఎస్ ఎస్ డీసీ) ప్రతినిధులు కుమార పురుషోత్తం, ఈ.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

---

## టెట్ హాల్‌టికెట్లలో తప్పులుంటే

# పరీక్షా కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చు

- అభ్యర్థులకు విద్యాశాఖ సూచనలు
- అక్టోబర్ 3 నుండి 21 వరకు టెట్ పరీక్షలు

అమరావతి(చైతన్యరథం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. పాఠశాల విద్య డైరెక్టర్ వి విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో టెట్ పరీక్ష వివరాలు తెలియజేశారు. టెట్‌కి 4,27,300 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షల హాల్ టికెట్లను ఈ నెల 22న విడుదల చేశారు. అభ్యర్థులు తమ టెట్ హాల్‌టికెట్లు విద్యాశాఖ వెబ్ సైట్ (http://cse.ap.gov.in) నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు 2,84,309 మంది హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి పరీక్ష కేంద్రం దగ్గర నామినల్ రోల్స్‌లో సరిచేయించుకోవచ్చు. ఇందుకోసం పరీక్షా కేంద్రం దగ్గర అధికారులు ఏర్పాట్లు చేస్తారు. గతంలో నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం అక్టోబర్ 3 వ తేదీ నుండి 21వ తేదీ వరకు (11, 12 తేదీలు మినహా) టెట్ పరీక్షలు జరుగుతాయి. ఏదైనా సందేహాలు ఉంటే డైరెక్టరేట్ కమిషనర్ కంట్రోల్ రూమ్‌కి ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు. ఫోన్ నెంబర్లు: 9398810958, 6281704160, 8121947387, 8125046997, 7995789286, 9398822554, 7995649286, 9963069286, 9398822618. లేదంటే సందేహాలను ఈ మెయిల్ ద్వారా grievences.tet@apschooledu.inకి పంపించవచ్చని విజయరామరాజు తెలిపారు.

---

## కామన్‌వెల్త్ మహిళా పార్లమెంటరీ

# స్టీరింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

అమరావతి(చైతన్యరథం): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ ప్రతినిధిగా, కామన్‌వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు.

ఈ మేరకు లోకసభ స్పీకర్ ఓం బిర్లా ఉత్తర్వులు జారీ చేశారు. 2026 చివరి వరకు ఆమె పదవిలో కొనసాగుతారు.

సీపీఏ ఇండియా రీజియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగానే కాకుండా మహిళా పార్లమెంటేరియన్ల, స్టీరింగ్ కమిటీకి చైర్‌పర్సన్‌గా కూడా ఆమె వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు రాజమండ్రి ఎంపీ కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు.



చైతన్యరథం

# షాదీఖానా నిర్మాణానికి సహకరించండి

- డయాలసిస్ కోసం ఆర్థికసాయం చేసి ఆదుకోండి
- 35వ రోజు మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్"కు విన్నపాల వెల్లువ
- అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చిన మంత్రి



అమరావతి(చైతన్యరథం):ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ 35వ రోజు "ప్రజాదర్బార్"కు ప్రజల నుంచి విన్నపాలు వెల్లువెత్తాయి. మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సోమవారం మంత్రి నారా లోకేష్‌ను స్వయంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి... అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

### మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన విజ్ఞప్తులు

దివ్యాంగురాలినైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన కె.విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

రెండు కిడ్నీలు పాడైపోయిన తనకు డయాలసిస్ కోసం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన సంగ నాగేంద్రబాబు కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

డిప్లమో చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన శీరం సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పెన్షన్‌ను తిరిగి పునరుద్ధరించాలని మంగళగిరికి చెందిన దాసరి మేజేస్ కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

ఎలాంటి ఆధారం లేని తనకు ఎయిమ్స్ ఆసుపత్రిలో స్వీపర్ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన కే.అఖిల విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం గుండాలపాడుకు చెందిన ముస్లిం మైనార్టీలు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. తమ గ్రామంలో ఉన్న 15 సెంట్ల మసీదు మాన్యంలో షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో వివాహాది శుభకార్యాలకు కల్యాణమండపం కానీ, షాదీఖానా కానీ లేవని, గ్రామంలో ముస్లిం మైనార్టీల జనాభా ఎక్కువ ఉన్నందున షాదీఖానా నిర్మాణానికి సహకరించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

ఏపీ జెన్‌కో లో ఫైర్, సెక్యూరిటీ విభాగాల్లో పని చేస్తున్న మాజీ సైనికులకు రెగ్యులర్ సిబ్బందితో పాటు సమాన వేతనం కల్పించాలని, ఏడాదికి ఉన్న సెలవులను 12 నుంచి 30కి పెంచాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో చెరుకుపల్లి మండలం గూడవల్లిలో తనకు కేటాయించిన 2.84 ఎకరాల భూమికి డీకే పట్టా మంజూరు చేయాలని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు చెందిన చందోలు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

గత 33 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తాను ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నానని, ఏపీజీఎల్ఐ(ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్) సొమ్ము ఇప్పించి ఆదుకోవాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన ఎమ్ఎస్ సీహెచ్ సాయి బాబా కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల సర్వీసుపొడిగింపుతో పాటు 12నెలల వేతనం కల్పించాలని,పదవీ విరమణతర్వాత కనీస పింఛన్ కల్పించాలని డీఎస్సీ-98 ఎంటీఎస్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

పల్నాడు జిల్లా క్రోసూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్య కమిటీ చైర్మన్ బి.రాధాకృష్ణ. మంత్రి లోకేష్‌ను కలిశారు. శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాతభవనం ఎప్పుడు కూలిపోతుందోనని అని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

అనారోగ్యంతో బాధపడుతున్న తాను ఆసుపత్రిలో చికిత్స పొందానని, సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందించి ఆదుకోవాలని మైలవరం నియోజకవర్గం కొత్తూరు తాడేపల్లికి చెందిన ధనేకుల ఉషాకుమారి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటా మని మంత్రి హామీ ఇచ్చారు.

మైలవరంలో తన తల్లి పేరుపై ఉన్న ఎకరం భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్‌తో అన్యాక్రాంతం చేశారని కొత్తూరు తాడేపల్లికి చెందిన కొమ్మినేని కనకయ్య ఫిర్యాదు చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.













చైతన్యరథం

# వెల్లువెత్తిన మానవత్వం!

## సీఎం సహాయనిధికి దాతల విరాళాలు | అమోఘంగా పనిచేస్తోన్న సీఎం పిలుపు

అమరావతి (చైతన్య రథం): మొన్నటి వరదలకు భారీ నష్టాలు సంభవించిన నేపథ్యంలో.. బాధిత వర్గాలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు రామబాణంలా పనిచేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి సహాయ నిధికి సుమారుగా రూ.350 కోట్లు విరాళాలు వచ్చిన నపథ్యంలో.. ప్రజల స్పందనపై ప్రభుత్వం ఆనందం వ్యక్తం చేస్తోంది. భారీ వరద, అందులో ప్రభావిత ప్రాంత ప్రజల కష్టాలను కళ్లారా చూసిన ప్రజలు.. చేతనైనంత సాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రకటిస్తున్నారు. ముఖమంత్రి సైతం దాతలను దగ్గరకు తీసుకుని కృతజ్ఞతలు చెప్తుండటంతో.. ప్రజల్లో సాయం అందించాలన్న తపన అంతకంతకూ ఎక్కువవుతోంది. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి పలువురు చెక్కులను అందజేశారు. విరాళాలు అందించిన వారిలో ఎంప్రాడ మైన్స్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.కోటి, ఆనంద గ్రూప్ చైర్మన్ కాశీ విశ్వనాథ రాజు రూ.50 లక్షలు, పార్టీ నేతలు, కార్యకర్తల సహకారంతో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి రూ.50 లక్షలు సీఎం సహాయనిధికి అందించారు. ఇక, మధుసూదన శివప్రసాద్ పండా రూ.51 లక్షలు, విమ్టా ల్యాబ్స్‌నుంచి హరిమాన్ ఉంగల్ రూ.30 లక్షలు, నందమూరి మోహన్ కృష్ణ రూ.25 లక్షలు, భద్రాచలం నుంచి పంచాక్షరయ్య రూ.25 లక్షలు సీఎం చంద్రబాబుకు చెక్కుల రూపంలో అందించారు.

ఆర్.వీ.చక్రపాణి, ఆర్వీ అసోసియేట్స్ నుంచి ఆర్వీ చక్రపాణి రూ.25 లక్షలు, శ్రీ గౌతమి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.25 లక్షలు, మోల్డ్- టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ రూ.25 లక్షలు, బి అనూప్ కుమార్ తదితరులు హైదరాబాద్ రూ.13 లక్షలు (వీరి తరపున టీడీపీ ఎన్నారై అధ్యక్షులు డాక్టర్ వేమూరి రవి అందజేశారు), ఆతోట సుధాకర్, స్వెక్రా ఫుడ్స్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ఆతోట సుధాకర్ రూ.11 లక్షలు, తిరుపతి స్విమ్స్ డైరెక్టర్ కమ్ వీసీ ప్రొఫెసర్ ఆర్వీ కుమార్ రూ.20 లక్షలు సీఎం సహాయ నిధికి విరాళాలు అందించారు. ది కర్నూలు డిస్ట్రిక్ట్ మిల్క్ పీఎంపీసీ లిమిటెడ్ రూ.20 లక్షలు, ప్రముఖ న్యూట్రీషియన్ డాక్టర్ వినీలా కొండపల్లి రూ.10 లక్షలు, విజయవాడ ఆంజనేయ జ్యువెలర్స్ వడ్లమూడి వెంకటరావు రూ.10లక్షల వెయ్యి నూటపదహార్లు, ఛారిటబుల్ సొసైటీ నుంచి కె.వెంకటాద్రి చౌదరి రూ.10 లక్షలు, విజయవాడ నారాయణ కాలేజీ విద్యార్థులు రూ.9 లక్షలు, మార్వాడీ అసోసియేషన్ నుంచి డాక్టర్ రసిక్ సింఘ్వీ రూ.5 లక్షలు, మాచర్ల శివ భాస్కర్ రూ.5 లక్షలు, పెదకూరపాడు శ్రీ కాకతీయ జూనిర్ అండ్ డిగ్రీ కాలేజ్ నుంచి రూ.5 లక్షలు, కిడ్డీస్ స్కూల్ నుంచి జి.కేశవ నారాయణరెడ్డి రూ.5 లక్షలు, ఎస్. యోగివల్లి రూ.5 లక్షలు, తాడేపల్లిగూడెం భారతీయ విద్యా భవన్స్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ రూ.4.5 లక్షలు, భారతీయ విద్యా భవన్స్ గ్రీన్ ఫీల్డ్స్ స్కూలునుంచి రూ.4 లక్షలా 50 వేలు, ఎంఎస్‌కే ప్రసాద్ రూ.3 లక్షలు, అనూప్ కన్‌స్ట్రక్షన్స్ నుంచి అనూప్ కుమార్, రూ.3 లక్షలు, తెనాలి డాక్టర్స్ అసోసియేషన్ తరపున రూ.2 లక్షల 51 వేలు, భారతీయ విద్యా భవన్ గ్రీన్ ఫీల్డ్స్ స్కూల్ తరపున సత్యనారాయణమూర్తి రూ.2.25 లక్షలు, భారతీయ విద్యా భవన్స్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ తరపున శివగామ సుందరి, రూ.2 లక్షల 25 వేలు, వీనస్ స్కూల్ నుంచి టీ. తిలక్‌బాబు రూ.2 లక్షలు, ఆంధ్రా కార్పొరేషన్ యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ స్టాఫ్ అసోసియేషన్ రూ.2 లక్షలు, కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.2 లక్షలు, మాథివ్ పబ్లిక్ స్కూల్ రూ.2 లక్షలు, నెప్పల శారద రూ.2 లక్షలు, కె.కైలాస నాగ హైమావతి రూ.లక్షా 116, గుడివాడ మహిళా సంఘం రూ.లక్ష, అన్నే పుష్పలీల రూ.లక్ష, అల్లూరి సురేష్ రూ.లక్ష, శ్రీ వెంకటేశ్వరా రాక్స్ రూ.లక్ష, ఆంధ్రప్రదేశ్ కార్పెంటర్స్ అసోసియేషన్ రూ.లక్షా 20 వేల 116, దాసరి కుమారి రూ.50 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళమిస్తూ చంద్రబాబుకు చెక్కులు అందించారు.


రూ.50 లక్షల చెక్కు అందజేస్తున్న ఆనంద గ్రూప్ చైర్మన్ యు.కాశీవిశ్వనాథరాజు



రూ.50 లక్షల చెక్కు అందజేస్తున్న రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి, నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులు


రూ.30 లక్షల చెక్కు అందజేస్తున్న హరిమాన్ ఉంగల్, విమ్టా (VIMTA) ల్యాబ్స్


రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న భద్రాచలానికి చెందిన పంచాక్షరయ్య


రూ.20 లక్షల చెక్కు అందజేస్తున్న
తిరుపతి స్విమ్స్ డైరెక్టర్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వి.కుమార్


హైదరాబాద్‌కు చెందిన బి.అనూప్‌కుమార్ తదితరులు ఇచ్చిన
రూ.13 లక్షల విరాళాల చెక్కులను సీఎం చంద్రబాబుకు
అందజేస్తున్న టీడీపీ ఎన్ఆర్ఐ అధ్యక్షుడు వేమూరి రవి


రూ.10 లక్షల చెక్కుతో పాటు సీఎం చిత్రపటాన్ని అందజేస్తున్న ప్రముఖ న్యూట్రిషియన్ కొండపల్లి వినీలా


రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న మాజీ క్రికెటర్,
బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్.


రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న పెదకూరపాడు శ్రీ కాకతీయ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు


రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు

# బాధితులకు బాసటగా...

- వరద బాధితులకు పలువురి విరాళాలు
- మంత్రి లోకేష్‌కు చెక్కులు అందజేత

అమరావతి(చైతన్యరథం): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మంచి మనసుతో దాతలు ముందుకు వస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి సోమవారం పలువురు విరాళాలు అందజేశారు.

విజయవాడకు చెందిన AP TPO అసోసియేషన్ ప్రతినిధులు రూ. 2లక్షలు.

విజయవాడకు చెందిన టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు 1,13,216.

పశ్చిమ గోదావరిజిల్లాకు చెందినఇండోవేదిక్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు ఎంఆర్‌కే రెడ్డి రూ.లక్ష.

విజయవాడకు చెందిన జేబీ ఎస్టేట్స్ అధినేత జే.పాండురంగారావు రూ.లక్ష.

విజయవాడకు చెందిన డాక్టర్ టి.హనుమయ్య రూ. 84,000.

విజయవాడకు చెందిన మెగా టౌన్ షిప్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ. 64,700.

తిరువూరు నియోజకవర్గం చీమలపాడుకు చెందిన బెజవాడ శంకర్ రూ. 50,117.

విజయవాడకు చెందిన కేఎస్ నాగమణి రూ. 50,116.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఎస్. హేమ రూ. 50 వేలు.

వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన దాతలకు మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.





















# ప్రజలు మెచ్చిన మంచి ప్రభుత్వమిది...

- ఐదేళ్లలో చేయనివి 100 రోజుల్లో చేసి చూపించాం
- దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతున్నాం
- పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు: పేదల కన్నీరు తుడిచేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన 100 రోజుల పూర్తయిన సందర్భంగా సోమవారం ఉదయం నిడదవోలు రూరల్ మండలం డి.ముప్పవరం గ్రామంలో ఏర్పాటు చేసిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి 100 రోజుల్లో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకుని వారు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఇంటిపై ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను మంత్రి అతికించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు, నేతలు వచ్చి ఇది మంచి ప్రభుత్వం అని చెప్పడం కాదని, సాక్షాత్తు ప్రజలే ఇది మంచి ప్రభుత్వం అని మెచ్చుకుంటు న్నారన్నారు. ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు విశ్వసించినందువల్లే భారీ సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పనితీరు బాగోలేదు కాబట్టే ఇంటికి పంపించారని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయని పనులను కూటమి ప్రభుత్వం కేవలం నెలరోజుల్లోనే చేసి చూపించిందన్నారు. ప్రజల్లో వెలుగులు నింపేందుకు దీపావళి రోజు నుండే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు,ఎంపీటీసీ ఎస్.సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి దుర్గేష్,ఎంపీడీవో శామ్యూల్, తహసీల్దార్ బి.నాగరాజునాయక్, సర్పంచ్ నాగిరెడ్డి నాగదేవి, ఉప సర్పంచ్ బి.బ్రహ్మాజీ, స్థానిక నాయకులు వి.సూర్యారావు, ఎం.దుర్గారావు, రంగా రమేష్, పాల వీరాస్వామి, మేడిచర్ల మాధవరావు, పెన్నాడ యజ్ఞేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### నెలరోజుల్లో నిడదవోలులో మినీ స్టేడియం ప్రారంభం

నిడదవోలు నియోజకవర్గం స్థాయి అండర్-14,17 బాలబాలికల క్రీడాకారుల ఎంపిక సోమవారం ఉదయం నిడదవోలు గవర్నమెంట్ బాలుర హైస్కూల్‌లో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతిభ కలిగిన క్రీడాకారుల సమా దారాన్ని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీల ద్వారా తెలియజేస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నెలరోజుల్లో నిడదవోలులో మినీ స్టేడియం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలుర హైస్కూల్ హెచ్ఎం గురునాథ్, విద్యాకమిటీ చైర్మన్ సూరఖ్,మండల పీడీలు,ఉపాధ్యాయులు,పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్,బీజేపీ మండల అధ్యక్షుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య-శిబిరం పరి-శీలన

నిడదవోలులో స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. వైద్యులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గ ప్రజల రుగ్మతలను, ఇతరత్రా వైద్య సమస్యలను నయం చేసేందుకు స్థానిక వైద్యులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వివిధ విభాగాల వైద్యులు, పారామెడికల్ సిబ్బంది వచ్చారని మంత్రి తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు. దేశాన్ని ఆరోగ్యవంతంగా తయారు చేసుకునేందుకు, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పీహెచ్‌సీ వైద్యులు పద్మశ్రీ, సూపరింటెండెంట్ అలీ, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మహా ప్రసాదంపై అనుమానాలొద్దు



- శాంతిహోమం తరువాత ప్రకటించిన తితిదే
- అన్ని విభాగాల శుద్ధికి పంచగవ్య ప్రోక్షణ
- ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు

తిరుమల (చైతన్య రథం): శ్రీవారి ఆలయంలో చోటుచేసుకున్న అపచారానికి.. దోష నివారణ ప్రాయశ్చిత్తంగా శాంతి హోమం పూర్తి చేసినట్లు తితిదే ఈవో శ్యామలరావు వెల్లడించారు. ఆలయంలో శాంతిహోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాల అనంతరం ఈవో, ఆలయ అర్చకులు మీడియాతో మాట్లాడారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. స్వామి వారికి మహా నైవేద్యం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లో ప్రోక్షణ చేస్తున్నామన్నారు. దోషం కలిగిందన్న భావన లేకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

చివరిగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగుతాయన్నారు. భక్తులెవరూ ఆందోళన చెందవద్దని, మహా ప్రసాదంపై అనుమానాలు పెట్టుకోవద్దని భక్తులు, ప్రజలను తితిదే కోరింది. 'ఇటీవల చోటుచేసుకున్న దోషాలు పరిహారం కావాలని శాంతిహోమం పూర్తిచేశాం. పవిత్రోత్సవాలకు ముందే నెయ్యిని మార్చేశాం. లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలొద్దు. పవిత్రోత్సవాల ముందు జరిగిన దోషం.. పవిత్రోత్సవాలతో పోయింది. మార్చిన నెయ్యితోనే తర్వాత ప్రసాదాలు. తయారు చేశాం. తెలిసీ తెలియక జరిగిన దోషాలు శాంతిహోమం, ప్రోక్షణతో తొలగుతాయి" అని వేణుగోపాల దీక్షితులు అన్నారు.

ఇదిలావుంటే.. తిరుమల లడ్డూకు నెయ్యి సరఫరా చేసిన ఓ కంపెనీకి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నోటీసులు జారీ చేసింది. నాలుగు కంపెనీల నుంచి నెయ్యి నమూనాలను సేకరించిన కేంద్రం.. నాణ్యత పరీక్షలో ఒక కంపెనీకి చెందిన నెయ్యి విఫలమైనట్లు వెల్లడించింది.

# అన్న క్యాంటీన్ ప్రారంభం ఆనందంగా ఉంది

- పేదల కడుపు నింపాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం
- రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(చైతన్యరథం): రాష్ట్రంలో పేదలెవరూ ఆకలితో అలమటించకూడదనే వారి కడుపు నింపాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం జరిగిందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం తిరి గి అన్న క్యాంటీన్లు ప్రారం భించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తొలగించి పేదల



పొట్టకొట్టిందని, కూటమి తిరిగి ప్రారంభించి వారి కడుపు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో తొలి విడత 100 క్యాంటీన్లు ప్రారంభించగా.. రెండో విడతలో 75 అన్న క్యాంటీన్లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. దినసరి కూలీలు, పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, వివిధ ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు,ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి క్యాంటీన్ వద్ద పూటకు 400 మంది చొప్పున రోజుకు 1200 మందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా భోజనం ఉంటుందన్నారు. ఇకనుంచి రాష్ట్రంలో ఎక్కడా కూడా ఆకలి కేకలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవారి ఆస్తుల పరిరక్షణ.. కూటమి ప్రభుత్వ బాధ్యత

- ఆస్తుల వివరాలు, ఆభరణాల లెక్కలు పరిశీలించాలి
- శ్రీవాణి ట్రస్ట్ ఆదాయం ఎటు మళ్లించారు?
- సమగ్ర విచారణ జరిపించాలి
- దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆస్తులను సమీక్షించాలి
- సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ వినతి

అమరావతి (చైతన్యరథం): తిరుమల శ్రీవారి ఆస్తుల పరిరక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వెంకటేశ్వరుడిపై విశ్వాసంతో భక్తులు ఆస్తులు ఇచ్చారని, వాటిని నిరర్థక ఆస్తులంటూ గత టీటీడీ పాలకమండలి అమ్మే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం టీటీడీ ఆస్తులకు, భగవంతుడి ఆభరణాలకు రక్షణ కల్పించిందా.. లేదా? అనే కోణంలో విచారణ అవసరమన్నారు. శ్రీవాణి ట్రస్టుకు వచ్చిన విరాళాలు, ఖర్చుల లెక్కలను, స్వామివారి ఆభరణాలను పరిశీలించాలన్నారు. ఈ మేరకు సోమవారం పవన్ కళ్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిపై అచంచల విశ్వాసంతో.. భక్తులు తమకు ప్రాప్తించిన ఆస్తిపాస్తులు దైవాను గ్రహమని భావిస్తారు. తమ ఆస్తులను ఆ భగవంతుడికి ఇచ్చేస్తూ... దస్తావేజులను హుండీలో వేసే వక్తులూ ఉన్నారు. అలా తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాదు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు... ఇలా పలు రాష్ట్రాల్లో స్థిరా స్తులు ఉన్నాయి. ముంబయి, హైదరాబాద్ నగరాల్లో భవనాలు ఉన్నాయి. భక్తులు ఎంతో విశ్వాసంతో ఇచ్చిన ఆస్తులను నిరర్థకం అంటూ విక్రయించాలని వైసీపీ పాలనలో నియమితమైన టీటీడీ పాలక మండలి నిర్ణయించి ప్రకటన కూడా ఇచ్చింది. అసలు వాటి పాలకమండలి స్వామి వారి ఆస్తుల పరిరక్షణ కంటే పప్పు బెల్లాల్లా అమ్మేయడానికి ఎందుకు ఎందుకు ఉత్సాహం చూపించింది. వారిని ఆ విధంగా నడిపించింది ఎవరు? అనేది బయటకు తీస్తాం.

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆస్తులను గత పాలక మండళ్లకు నేతృత్వం వహించినవారు కాపాడారా.. లేక వాటిని అమ్మేశారా అనే సందే హాలు వస్తున్నాయి. తిరుమల శ్రీవారి ఆస్తులను పరిరక్షించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకొంటుంది. ఈ క్రమంలో గత పాలక మండళ్ళ టీటీడీ ఆస్తుల విషయంలో చేసిన నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేస్తున్నాను.

తమిళనాడులో 23 ఆస్తులను వేలం ద్వారా విక్రయించాలని వైసీపీ పాలకులు నియమించిన టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. ఆ ఆస్తుల విలువ రూ.23.92 కోట్లుగా లెక్కగట్టారు. నిరర్థక ఆస్తుల విక్రయం ద్వారా రూ.100 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రయత్నించింది. గుంటూరులో ఒక భవనం, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం అంబర్‌పేట కలాన్ ప్రాంతంలో స్థలం, మల్కాజిగిరి ప్రాంతంలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్, నాందేడ్, బెంగళూరుల్లోని కొన్ని ఆస్తులు అమ్మకానికి సిద్ధం చేసింది. ఆ రోజు ప్రతిపక్ష స్థానంలో ఉన్న మా పార్టీలు, పలు హిందూ ధార్మిక సంస్థలు బాధ్యతగా, బలంగా స్పందించాము. అప్పుడు వేలం ద్వారా విక్రయించే ప్రయత్నాలు నిలిచిపోయాయి.

**ఆభరణాలు, నగలను పరిశీలించాలి**

అదే విధంగా తిరుమల శ్రీవారికి కొన్ని శతాబ్దాలుగా రాజులు, భక్తులు నగలు, ఆభరణాలు అందచేశారు. వాటి జాబితాను కూడా పరిశీలించి... క్షుణ్ణంగా మదింపు చేయాలని టీటీడీ అధికారులకు సూచిస్తున్నాను. ఎందుకంటే స్థిరాస్తులను అమ్మేయాలని చూసినవాళ్ళు ఆభరణాలు, బంగారం విషయంలో కూడా కచ్చితంగా పెడపోకడలతో ఏదైనా అవాంఛనీయ నిర్ణయాలు తీసుకున్నారా అనే విషయం మీదా దృష్టిపెట్టాలి.

**శ్రీవాణి ట్రస్ట్ ద్వారా వచ్చిన ఆదాయం ఎటు వెళ్లింది?**

శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పతి భక్తుడి నుంచి రూ.10,500 తీసుకున్నారు. ఇందులో బిల్లు రూ.500కే ఇచ్చారు. ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి వచ్చిన ఆదాయాన్ని నాటి పాలక మండళ్ళు ఎటు మళ్లించాయో కూడా విచారణ చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రిని కోరాను. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అటు కశ్మీర్ నుంచి ఇటు బెంగాల్ వరకూ ఆలయాలు నిర్మించేస్తామని అప్పటి పాలకులు చెప్పారు. అసలు ఆ ఆలయాలు ఎవరి ద్వారా నిర్మాణం చేపట్టారు? ఆ సంస్థ ఏమిటి? ఎంత మేరకు శ్రీవాణి ట్రస్ట్ ఆదాయం మళ్లించారో భక్తులకు తెలియచేయడం అవసరం.

**దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆస్తులపై సమీక్ష అవసరం**

తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి



మాత్రమే కాదు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న అన్ని ఆలయాలు, సత్రాల ఆస్తుల విషయంలోనూ ఒక సమీక్ష అవసరమని ముఖ్యమంత్రికి సూచిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టేసిన గత పాలకులు.. దేవుడి మాన్యాలు, ఆస్తుల జోలికి వెళ్ళకుండా ఉంటారా అనే సందేహం ప్రజల్లో ఉంది.

ఎందుకంటే నాడు పాలనలో ఉన్నవారికి ధర్మ పరిరక్షణపట్ల విశ్వాసం ఉన్నట్లుగా కనిపించడం లేదు. కాబట్టి టీటీడీ ఆస్తులు, ఆభరణాల వివరాలతోపాటు, రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలు, సత్రాల ఆస్తుల వివరాలు, సదరు ఆస్తుల ద్వారా వస్తున్న రాబడినీ ప్రజలకు తెలియచేయడం అవసరం. తద్వారా భక్తులకు వివరాలు అందుబాటులోకి వస్తే దేవుడి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉండటంతో పాటు, ఆలయాల పాలక మండళ్ళు జవాబుదారీతనంతో పని చేస్తాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని డిప్యూటీ సీఎం పవన్ స్పష్టం చేశారు.

## హిందువుల మనోభావాలు దెబ్బతీసిన జగన్ రెడ్డి

- తిరుమల లడ్డూ కల్తీలో వెలంపల్లి పాత్ర కూడా ఉంది
- దోషులందరినీ ప్రజల ముందు నిలబెడతాం
- టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్



అమరావతి(చైతన్యరథం): హిందూ వ్యతిరేకి జగన్ మోహన్ రెడ్డి హయాంలో పవిత్రమైన తిరుమల లడ్డూ అపవిత్రమయిందని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డూండి రాకేష్ మాట్లాడుతూ శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 5 సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ కూడా హిందువుల పండుగులకు, హిందువుల గుడులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. గతంలో వినాయక చవితి, దసరా నవరాత్రులు, సంక్రాంతి ఉత్సవాలు, ఉగాది, ఏ పండుగ చేయాలన్న అన్నీ ఆటంకాలే. జగన్ హయాంలో లెక్కలేనని దేవాలయాల మీద దాడులు జరిగాయి. చివరికి హిందువులు అత్యంత భక్తితో కొలుచుకునే తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూని కూడా అపవిత్రం చేశాడు. జగన్ మోహన్ రెడ్డికి హిందువుల మనోభావాల గురించి తెలుసా ? ఎప్పుడైనా కుటుంబ సమేతంగా వెళ్లి ఆ వెంకన్న స్వామిని దర్శించుకున్నాడా? ఏ గుడికి అయినా సరే జగన్‌రెడ్డి సతీమణిని తీసుకు వెళ్లాడా? వెంకన్న స్వామి ఆలయ సెట్టును ఇంట్లో వేయించుకున్న మూర్ఖుడు జగన్ రెడ్డి. తిరుమలలో ఇంత ఘోరం జరుగుతుంటే జగన్ రెడ్డి నియమించిన టీటీడీ చైర్మన్లు ఏం చేస్తున్నారు. ఇద్దరు అన్యమతస్తులను టీటీడీ చైర్మన్లుగా నియమించి తిరుమలను అపవిత్రం చేస్తూ, ఇష్టం వచ్చినట్లు నిర్ణయాలు తీసుకుని ఒంటెద్దుపోకడతో హిందూ మనోభావాలతో ఆడుకుని, తిరిగి మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు జగన్ మోహన్ రెడ్డికి సిగ్గుండాలి. హైకోర్టులో పిల్ వేసిన వైసీపీ నేతలు.. సోమవారం అఫిడవిట్ ఫైల్ చేయమంటే ఎందుకు ఫైల్ చేయలేదు? దానికి సమాధానం చెప్పాలి. నెయ్యి కల్తీ జరిగినట్లు తేల్చిన ల్యాబ్ రిపోర్టుల గురించి ఎందుకు మాట్లాడటం లేదు? తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీ గురించి ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నాడు? తిరుమల లడ్డూని అపవిత్రం చేసిన కుట్రలో జగన్ మోహన్ రెడ్డి, టీటీడీ చైర్మన్లగా పని చేసిన వారితో పాటు ఇంకొక అజ్ఞాత వ్యక్తి కూడా ఉన్నాడు. అతనే విజయవాడ ప్రాంతానికి చెందిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్. ఆ రోజు దేవాదాయశాఖ మంత్రిగా ఉండి, జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అతనే దగ్గరుండి ఈ కార్యకలాపాలన్నీ చేయించాడు. హిందూ వ్యతిరేకులు అంతా ఒక చోట కలిసి హిందువులను, దేవుడిని, దేవుడి గుడులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. వెలంపల్లికి 2022 మోడల్ ఏపీ08ఈఫ్ 4444 బెంజ్ కారు ఎక్కడ నుంచి వచ్చిందో చెప్పాలి. ఇప్పుడు నెయ్యి కల్తీ చేసినట్లు బయటపడ్డ ఏఆర్ ఫుడ్స్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చినందుకు ఈ బెంజ్ కారు కానుకగా ఇచ్చారు. ఆ తరువాత అదే బెంజ్ కారులో పోలీస్ సెక్యూరిటీతో వెళ్లి ఎన్ని కోట్ల రూపాయల డబ్బులు జగన్ మోహన్ రెడ్డికి వెలంపల్లి అందజేశాడో త్వరలో మీడియాకి తెలియజేస్తాం. దీనిలో ఎవరెవరి పాత్ర ఉందో, ఎక్కడ నుంచి ఎక్కడకు డబ్బులు చేతులు మారాయో అన్నీ తేలుస్తాం. ఇన్ని మాటలు మాట్లాడుతున్న జగన్ రెడ్డి.. తిరుమల లడ్డూ వ్యవహారంపై విచారణకు సిద్ధం అని మాత్రం చెప్పలేకపోతున్నాడు. ఎందుకంటే అతడికి తెలుసు చేసిన తప్పేమిటో. అందుకే తన బంధువులైన ఇద్దరు రెడ్లను వెనకేసుకొస్తున్నాడు. జగన్ రెడ్డికి, టీటీడీ చైర్మన్లుగా చేసిన ఆయన బంధువులకు, మధ్యలో వ్యవహరించిన వెలంపల్లి శ్రీనివాస్‌కి ఎన్ని డబ్బులు ముట్టాయో అన్నీ తెలుసు. అందుకే జగన్ రెడ్డి నోటినుంచి విచారణ అనే మాట రావటం లేదు. దేవుడితో ఆటలాడుకున్న ఎవరినీ వదిలేది లేదు. కచ్చితంగా రాబోయే రోజుల్లో దీని మీద విచారణ జరిపించి, దోషులను ప్రజల ముందు నిలబెడతామని డూండీ రాకేష్ స్పష్టం చేశారు.

## రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ☐ సంక్షేమం, అభివృద్ధి బాటలో నూరు రోజుల పాలన
- ☐ మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు (చైతన్యరథం): రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఘనమైన విజయాన్ని అందించారని, ఈ విజయాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా భావించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం ఏలూరు జిల్లా నూజివీడు మండలం సుంకొల్లు, యన మందల, బత్తులవారి గూడెం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి 100 రోజుల్లో ఎన్‌డిఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు. అక్కడ ప్రజల సమస్యలను మంత్రి వివ రంగా అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామాల్లో రూ.43.50 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పార్థసారథి శంకుస్థాపన చేశారు. యనమందల గ్రామంలో రూ.15 లక్షలతో, సుంకొల్లు గ్రామంలో రూ.7.50 లక్షలతో, బత్తులవారిగూడెంలో రూ. 21 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు తెలిపారు. 100 రోజులు పూర్తిచేసుకున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపిస్తూ ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలచేత అనిపించుకుంటోందన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే రాష్ట్రంలో 64 లక్షలు మంది సామాజికి పింఛన్ దారులకు 3 వేల రూపాయలు నుంచి 4 వేల రూపాయలకు పెన్షన్ పెంచడమే కాక, 3 నెలల బకాయిలను కలిపి 7 వేలు రూపాయలు అందించామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది వాలంటీర్లు రెండు,మూడు రోజుల పాటు సామాజిక పెన్షన్లు పంపిణీ చేసేవారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం లక్షా ముప్పై వేల మంది సచివాలయాల సిబ్బందితో ఒక్కరోజులోనే పంపిణీ చేస్తున్నామన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు 5 రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. అంతేకాక నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో 16 వేల 700 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించారని, దీపావళి నుండి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ ప్రారంభిస్తామని, మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి గొప్ప విజన్, పరిపాలనా దక్షత, దూరదృష్టి ఉన్న నాయకుడు చంద్రబాబు మనకు ముఖ్యమంత్రిగా ఉన్నందున అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందుకు దూసుకెళుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లే నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఒక్కడే అని నమ్మి ప్రజలు రికార్డు స్థాయిలో సీట్లు గెలిపించారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఎక్కడా తాగునీరు సమస్య లేకుండా చూస్తానని, అవసరమైన ప్రదేశాలలో బోర్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నూజివీడు నియోజకవర్గంలో గతంలో మూతపడిన పరిశ్రమలను త్వరలో పున:ప్రారంభించి తద్వారా మరింత మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

సుంకొల్లు, యనమందల, బత్తులవారి గూడెం గ్రామాలలో పలు సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొని రాగా వెంటనే పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సుంకొల్లు గ్రామంలో ఏళ్ల తరబడి ఉన్న తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, సాగునీరు, విద్యుత్ స్తంభాలు, ఇళ్ల స్థలాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేయటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. యనమందలలో వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, హరిజన వాడలో ఇళ్ల స్థలాలు, మురుగునీరు, దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులును మంత్రి ఆదేశించారు.

సుంకొల్లు గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో అవకతవకలపై ఆరా తీయగా నూజివీడు మండలంలో రూ. 64 లక్షల పక్కదారి పట్టినట్లు గమనించిన మంత్రి ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి ఫీల్డ్ అసిస్టెంట్, ఇతర అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టి నిధులు మొత్తం రికవరీ చేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. గ్రామంలో జాబ్ కార్డు లేకుండా, సంతకాలు లేకుండా డ్రా చేసిన నిధులు రికవరీ చేసి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. గ్రామంలో పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం, విద్యుత్ లైన్‌మేన్, తదితర సిబ్బంది, అధికారులందరూ అందుబా టులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, మండల అభివృద్ధి అధికారి, స్థానిక నాయకులు గద్దె రఘు, ఎన్ వేణు, కె శ్రీను, ఎమ్ రాజా, ఎంఎన్ సత్యనారాయణ, ఎ సీతారామరాజు, పంచాయతీరాజ్, విద్యుత్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజం కూటమి ప్రభుత్వ లక్ష్యం

- చిన్నారులు, మహిళలందరికీ పోషకాహారం అందిస్తాం
- రక్త హీనత సమస్యను అధిగమించడం ధ్యేయంగా అడుగులు
- పోషకాహార మాసోత్సవాల్లో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): మహిళలు, చిన్నారులను వేధిస్తున్న రక్తహీనత సమస్యను పారదోలడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నడుచుకుంటోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని శారదానగర్లో సోమవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. చిన్నారులకు అన్నప్రాసన చేసి పోషకాహారాన్ని అందించారు. పలువురు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రక్తహీనత అనే సమస్యతో ఏ ఒక్కరూ బాధపడకుండా చూడడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకే ప్రతి ఒక్కరికీ పోషకాహారాన్ని అందిస్తున్నాం అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం మా లక్ష్యం. అక్కడక్కడా నమోదవుతున్న రక్తహీనత సమస్యలను పరిష్కరించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

## పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

- వైకుంఠపురంలో మంత్రి నాదెండ్ల మహా యాగం



తెనాలి (చైతన్యరథం): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షలకు సంఘీభావంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మహాయాగం నిర్వహించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం భక్త జనకోటి మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసింది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పాలక మండలి వ్యవహార శైలి, లడ్డూ కల్తీ ద్వారా చేసిన అపచారానికి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు శ్రీకారం చుట్టారు. పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మహా యాగం నిర్వహించారు. తెనాలిలోని వైకుంఠపురం దేవాలయంలో సోమవారం ఉదయం 11 గం. నుంచి మహా యాగం చేశారు. ఈ కార్యకమంలో పాల్గొని ధార్మిక విధులు నిర్వర్తించారు.

ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "తిరుమల ప్రసాదాన్ని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారన్నారు. లడ్డూ తయారీలో కల్తీని కలలో కూడా ఊహించ లేము. ఈ ఘటనపై ప్రతి ఒక్కరిలో వేదన ఉంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలియచేయడం అందరి బాధ్యత. దైవానికి ఎవరి వల్ల అపచారం జరిగినా.. అపచారం చేసినవారికి ఆ పశ్చాత్తాప భావన లేక పోయినా లోక క్షేమం కోసం ప్రాయశ్చిత్త దీక్ష చేయాలని పవన్ కళ్యాణ్ సంకల్పించారు.రాష్ట్రవ్యాప్తంగా జనసేన ఎమ్మెల్యేలు, నాయకులు, శ్రేణులు కూడా ఆలయాల్లో ప్రత్యేక పూజలు,హోమాలు,ధార్మిక కార్యక్రమాలు చేస్తున్నారని నాదెండ్ల తెలిపారు.

# బదిలీల తీరుపై డిప్యూటీ సీఎం పవన్ సంతృప్తి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో బదిలీలపై పేషీ అధికారులతో సమీక్ష



అమరావతి(చైతన్యరథం): తన పరిధిలోని మంత్రిత్వశాఖల్లో అధికారుల బదిలీలు జరిగిన తీరుపై డిప్యూటీ సీఎం, పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖలో పూర్తయిన బదిలీలపై పేషీ అధికారులతో సమీక్షించారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, జడ్పీ సీఈఓ, డీఎల్‌డీఓ బదిలీల ప్రక్రియలో నిబంధనలను అనుసరించ డం, మాతృ శాఖలో ఉన్న అధికారులకే పోస్టింగ్స్ ఇవ్వడం చెప్పుకోద గిన పరిణా మం అని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. బదిలీల కు ఉద్దే శించిన మార్గదర్శకాలు, నిబంధనలు పాటించడం మూలంగా ఇప్పటి వరకూ అప్రాధాన్యమైన స్థానాల్లో ఉన్నవారికి తగిన పోస్టింగ్స్ ఇవ్వ డం.. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులు పారదర్శకంగా కస రత్తు చేయడంపట్ల పవన్ కల్యాణ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా బదిలీల ప్రక్రియపై వచ్చిన స్పందన, వాటిపై వచ్చిన వార్తా కథనాలను అధికారులు.. ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వార్తా కథనాల్లో ప్రస్తావించిన అంశాలపై ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఆ పోస్టింగ్స్ ఇవ్వడానికిగల కారణాలను పేషీ అధికారులు వివరించారు.

# వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేది చంద్రబాబు ప్రభుత్వమే

- వంద రోజుల్లోనే 175 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం
- సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం, ఇది ప్రజా ప్రభుత్వం
- తొలి క్యాబినెట్ లోనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఇది రైతన్నల ప్రభుత్వం
- లో ఓల్టేజ్ సమస్యకు చెక్ పెట్టేలా సబ్ స్టేషన్ల నిర్మాణాలు
- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవి





కనిగిరి (చైతన్యరథం): వెలుగొండ ప్రాజెక్ట్‌ను కూటమి ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ ప్రాంత సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలో పర్యటించారు. స్థానిక చాకిరాల గ్రామ పంచాయతీలో 3 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం సబ్ స్టేషన్ ఆవరణలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే అనేక మంచి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. తొలి క్యాబినెట్ లోనే చర్చించి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతుల భూమికి భద్రత, భరోసా కల్పించినట్లు మంత్రి తెలిపారు. అలాగే పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రంలో 175 అన్నా క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభించామన్నారు.

కనిగిరి నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ రంగంపై ముఖ్యంగా బోర్లపై ఆధారపడి రైతులు వ్యవసాయం సాగిస్తున్నారని, రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఆర్డీఎస్ స్కీమ్ కింద రూ. 70 కోట్లతో చేపట్టిన విద్యుత్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక రైతాంగం కొత్త సబ్ స్టేషన్లు కావాలని కోరారని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో కొత్త సబ్ స్టేషన్లు మంజూరు చేస్తామన్నారు. అలాగే కనిగిరి నియోజక వర్గ పరిధిలో పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

ఇటీవల కనిగిరి నియోజక వర్గంలో విద్యుత్ లైన్ తెగి ముగ్గురు మరణించడం బాధాకరమని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి నా దృష్టికి తీసుకురావటంతో వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా త్వరగా అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే ఇలాంటి సంఘటనలకు సంబంధించి పెండింగ్ లో వున్న కేసులను క్లియర్ చేసి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఇటీవల విద్యుత్ లైన్ తెగి ముగ్గురు మరణించిన సందర్భంగా వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చెక్కును మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందచేసారు. అనంతరం ఆరుగురు షిఫ్ట్ ఆపరేటర్లకు మంత్రి నియామక పత్రాలను అందచేసారు.

# జెత్వానీ కేసులో కీలక పరిణామం

## నిందితులుగా ముగ్గురు ఐపీఎస్ అధికారులు



- ఏ2 పీఎస్సార్ ఆంజనేయులు, ఏ 3 కాంతి రాణా, ఏ 6 విశాల్ గున్నీ
- రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్న పోలీసులు
- మేజిస్ట్రేట్ ముందుకు కుక్కల విద్యాసాగర్
- అక్టోబర్ 4 వరకు రిమాండ్ విధించిన కోర్టు

విజయవాడ (చైతన్యరథం): ముంబై నటి కాదంబరీ జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులను పోలీసులు నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను డెహ్రాడూన్‌లోని ఓ రిసార్ట్‌లో ఇటీవల అరెస్ట్ చేసిన ఏపీ పోలీసులు అక్కడి నుంచి రైలులో విజయవాడకు తీసుకొచ్చారు. విద్యాసాగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి.. సోమవారం తెల్లవారు జామున మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి విద్యాసాగర్‌కు అక్టోబర్ 4వ తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం ఆయనను పోలీసులు జైలుకు తరలించారు. విద్యాసాగర్‌ను పోలీసులు కస్టడీకి కోరే అవకాశం ఉంది. ఈ సందర్భంగా పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సీనియర్ ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా తాతా, విశాల్ గున్నీలను నిందితులుగా చేర్చారు.

విజయవాడ: ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న కుక్కల విద్యాసాగర్ రిమాండ్ రిపోర్టును పోలీసులు కోర్టుకు సమర్పించారు. నిందితులుగా పలువురు ఐపీఎస్ అధికారుల పేర్లను అందులో చేర్చారు. ఏ2గా పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా కాంతిరాణా, ఏ4గా వెస్ట్ జోన్ మాజీ ఏసీపీ హనుమంతరావు, ఏ5గా అప్పట్లో జెత్వానీ కేసును దర్యాప్తు చేసిన విచారణాధికారి, ఇబ్రహీంపట్నం మాజీ సీఐ సత్యనారాయణ, ఏ 6గా విశాల్ గున్నీ పేర్లు చేర్చారు. ఈ కేసులో ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఈ ఐదుగురు అధికారులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కాంతి రాణా తాతా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం వరకు కాంతి రాణాపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. ఆయన ముందస్తు బెయిల్ పై హైకోర్టు మంగళవారం విచారించనుంది.

విద్యాసాగర్ ను విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసులో సమాచారమంతా పోలీసుల దగ్గర ఉంది. ఈ కేసులో అసలు కథ కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదుతో ప్రారంభమయింది కాబట్టి, అక్కడినుంచి విచారణ మొదలెట్టి మొత్తం గుట్టు బయటకు లాగనున్నారు. తప్పుడు కేసు ఎందుకు పెట్టారు.. ఫోర్జరీ పత్రాలు ఎందుకు సృష్టించారు. ముగ్గురు పోలీసు అధికారులు ఈ కేసులో ఎందుకు ఇంత లోతుగా జోక్యం చేసుకున్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు పదే, పదే ఎందుకెళ్లారు వంటి సమాచారం మొత్తం విద్యాసాగర్ ద్వారా బయట పెట్టించనున్నారు. కుక్కల విద్యాసాగర్ తన ఫిర్యాదులో ఓ వ్యక్తి పేరును చెప్పి.. అతనికి జెత్వానీ ఫోర్జరీ డాక్యుమెంట్లతో తన భూమిని అమ్మేందుకు అగ్రిమెంట్ చేసుకుని, అడ్వాన్స్‌గా రూ. 5లక్షలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే ఆ వ్యక్తి ఇప్పటికే తనకు ఎవరూ భూమి అమ్మే ప్రయత్నం చేయలేదని, తాను ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అంటే అసలు కేసే లేదు. ఐదు లక్షల రూపాయలు తీసుకున్నారంటూ జెత్వానీ కుటుంబం మొత్తాన్ని పోలీసులు అరెస్టు చేసి ముంబై నుంచి విజయవాడ తీసుకొచ్చి వేధించారు. ఈ కేసులో ఇప్పటికే కొన్ని ఆర్థిక లావాదేవీలనూ పోలీసులు బయటకు తీశారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వారికి, తప్పుడు కేసులు పెట్టిన వారికి ఓ పారిశ్రామికవేత్త నుంచి ఖరీదైన బహుమతులు అందాయని గుర్తించారు. కుక్కల విద్యాసాగర్‌ను విచారించి వీటన్నింటినీ బయటకు తీసి కీలక వ్యక్తుల్ని అరెస్టు చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

చైతన్యరథం

# పీపీపీ విధానంలో రోడ్ల అభివృద్ధిపై అధ్యయనం

- గుజరాత్ వెళ్లిన రాష్ట్ర బృందం
- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన ఆ రాష్ట్ర అధికారులు
- 2 రోజుల పాటు అధ్యయనం చేయనున్న కమిటీ
- నేడు గుజరాత్ సీఎంతో రాష్ట్ర బృందం భేటీ





అమరావతి: గుజరాత్‌లో పీపీపీ విధానంలో రోడ్ల అభివృద్ధి తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ సోమవారం ఆ రాష్ట్రానికి వెళ్లింది. మంత్రితో పాటు ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీఆర్డీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఇతర ఉన్నతాధికారుల బృందానికి గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర బృందంతో, గుజరాత్ ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆ శాఖ చీఫ్ ఇంజనీర్, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. గుజరాత్ రాష్ట్రంలో పీపీపీ విధానంలో రోడ్ల అభివృద్ధి తీరు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

**దేశంలోనే అత్యధిక బడ్జెట్**

గుజరాత్ రాష్ట్రంలో సుమారుగా 2 లక్షల కి.మీ కు పైగా రహదారులు ఉన్నాయి. వీటిలో పీపీపీ విధానం ద్వారా 14 రహదారులకు సంబంధించి, 1089 కి.మీ రహదారులను అభివృద్ధి చేశారు. వీటి ద్వారా సుమారుగా నెలకు రూ. 300 కోట్ల మేర టోల్ ఫీజు ద్వారా ఆదాయం వస్తోందని తెలియజేశారు. అహ్మదాబాద్ - రాజ్‌కోట్ రోడ్డు మార్గాన్ని 2003లో ప్రపంచ బ్యాంక్ నిధుల సహాయంతో అభివృద్ధి చేశామని, ప్రపంచ బ్యాంక్‌కు తిరిగి నిధులు చెల్లించే గడువు తేదీ 2020 వరకు ఉన్నప్పటికీ ముందస్తుగానే టోల్ ఫీజు ద్వారా సమకూరిన ఆదాయం ద్వారా 2016లోనే అప్పులు తిరిగి ప్రపంచ బ్యాంకుకి చెల్లించేశామన్నారు. పీపీపీ విధానం ద్వారా గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి గుజరాత్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.35 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపడుతోంది. ముఖ్యంగా వాహనాల రద్దీ అధికంగా ఉన్న రహదారులకు సంబంధించి 2 లైన్ల రహదారులను 4లైన్ల రహదారులుగా, 4లైన్ల రహదారులను 6 లైన్ల రహదారులుగా మార్చి, అభివృద్ధి చేసేందుకు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం 2007లో రహదారులు, భవనాల శాఖకు కేటాయించిన బడ్జెట్ రూ. 1100 కోట్లు ఉండగా.. 2023 నాటికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ. 22 వేల కోట్లకు చేరిందన్నారు. ఇది గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ మొత్తం బడ్జెట్ లో 15 శాతం అని తెలిపారు. ఈ స్థాయిలో రహదారులు, భవనాల శాఖకు బడ్జెట్ కేటాయింపులు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవని తెలియజేశారు.

వివిధ పథకాల గురించి చర్చించిన తర్వాత, మధ్యాహ్నం గాంధీనగర్ సిటీ నిర్మాణం గురించి చర్చించారు. దీనికి సంబంధించి 1970 నుంచి భూసేకరణ చేసిన విధానం, పద్ధతులు, భూ కేటాయింపులు, వివిధ వర్గాలకు భూమి కేటాయింపుకు సంబంధించిన విధానాలను ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. అలాగే గిఫ్ట్ సిటీ నిర్మాణం, హైటెక్ ఎగ్జిబిషన్ నిర్వహణ, మహాత్మ మందిర్ నిర్మాణం చేపట్టిన విధానం, దండి కుటీరం సందర్శన విధానాలు కూడా వివరించారు.

**నేడు గుజరాత్ సీఎంతో భేటీ**

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలోని ఉన్నతస్థాయి కమిటీ మంగళవారం గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌ని మర్యాదపూర్వకంగా కలవబోతున్నారు. గుజరాత్ లో స్వయంగా ముఖ్యమంత్రే రహదారులు, భవనాల శాఖ మంత్రిగా కొనసాగడం గమనార్హం.







# ఇది ప్రజలు కోరుకున్న.. మంచి ప్రభుత్వం

**- మంత్రి కొల్లు రవీంద్ర**





మచిలీపట్నం (చైతన్యరథం): ఇది ప్రజలు కోరుకున్న మంచి ప్రభుత్వమని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి వారి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం మండలంలోని పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోన గ్రామాలలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన గ్రామాలలోని పలు సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన సభల్లో మంత్రి మాట్లాడుతూ కూటమి పార్టీలకు 175 స్థానాలకు గాను 164 ఎంఎల్ఏ సీట్లు ఇచ్చి గొప్ప విజయాన్ని అందించారని, అందుకు ప్రజల అంచనాలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజుల్లో అమలు చేసిన పథకాలు వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, 16,500 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, నైపుణ్య గణన వంటి 5 ప్రధాన అంశాలపై తొలి సంతకాలు చేశారని మంత్రి గుర్తు చేశారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా వచ్చే దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నామన్నారు. తల్లికి వందనం పథకంపై ఇప్పటికే సర్వే జరుగుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకెళుతున్నామన్నారు.

**వంతెనలు నిర్మిస్తాం**

పల్లె తుమ్మలపాలెం సమీపంలోని గుండేరు, నడిమేరు ఉప్పుటేరులపై రూ.14 కోట్లతో వంతెనలను నిర్మించేందుకు టెండరు ప్రక్రియలు పూర్తి కానున్నాయని తెలుపుతూ త్వరలో నిర్మాణాలను చేపట్టి పూర్తి చేస్తామన్నారు. పల్లె తుమ్మలపాలెం, పోలాటితిప్ప, కోన గ్రామాలతో పాటు పరిసర గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు యాదర సమీపంలో 70 ఎకరాల విస్తీర్ణంలో చెరువును తవ్వించి అక్కడ నుండి అన్ని గ్రామాలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. పల్లె తుమ్మలపాలెం గ్రామంలో కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఫిష్ ల్యాండ్, మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను త్వరలోనే చేపడతామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.4 లక్షల అందిస్తామన్నారు. త్వరలో కృష్ణా యూనివర్సిటీ వరకు రెండు వరుసల రహదారి నిర్మాణం, అక్కడ నుండి పది మీటర్ల వెడల్పుతో అన్ని గ్రామాలను కలుపుతూ రహదారులకు మరమ్మతులు చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, మచిలీపట్నం తహసిల్దార్ మధుసూదనరావు, ఎస్ఎన్ గొల్లపాలెం ఎంపీటీసీ కల్హారి సురేష్, గ్రామ సర్పంచ్‌లు మోకా నాగరాజు, ఒడుగు నాగరాజు, మంగా రాజు, స్థానిక నాయకులు శ్రీనివాసరావు, వీరంకి మునేశ్వరావు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 100 రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు

◆సంక్షోభంలోనూ సంక్షేమ పథకాలు అందిస్తున్న చంద్రబాబు

◆కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి వెల్లడి

కావలి (చైతన్యరథం): నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వంద రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం బోగోలు మండలం బోగోలు మేజర్ పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బోగోలుకు విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. బోగోలు పంచాయతీలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ 100 రోజుల పాలన గురించి ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం అందించనున్న పథకాలను కూడా వివరించారు. రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. పాడిపంటల పుస్తకాలను పంపిణీ చేశారు. గజమాలతో ఎమ్మెల్యే ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రూ.3000 ఇచ్చే పెన్షన్ మొత్తాన్ని ఒకేసారి రూ.4 వేలకు పెంచడం జరిగిందని, దివ్యాంగులకు రూ.6000 కు పెంచడం జరిగిందన్నారు. ప్రజల ఆస్తులను బక్షించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయడం,



నిరుద్యోగులకు మెగా డీఎస్సీను ప్రకటించడం, పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. దీపావళి నుండి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే పథకం చేపడుతున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ అన్ని పథకాలు త్వరలో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. సంక్షోభంలోనూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. వ్యాపారాలు వదిలి నేను రాజకీయాల్లోకి రావడం జరిగిందని, నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ కొనసాగిస్తున్నాను అని తెలిపారు. అన్ని గ్రామాలకు త్రాగునీరు అందించే విధంగా కృషి చేస్తున్నానని, మండలంలోని అన్ని గ్రామాల పొలాలకు సాగునీరు అందించేందుకు కూడా కృషి చేస్తున్నానని తెలిపారు. రాబోయే సీజన్ నాటికి ప్రతి ఒక్క ఎకరాకు నీరు అందిస్తానని తెలిపారు. మండలంలోని జడగోగుల, సాంబశివపురం రోడ్లకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మండలంలో రూ.5 కోట్లతో సిసి రోడ్లు డ్రైనేజీలను నిర్మించనున్నామని తెలిపారు. ఇబ్బందికరంగా ఉన్న అన్ని విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలను మార్చనున్నామని తెలిపారు. కొరగుంట నుండి చేవూరు వరకు ఉన్న అన్ని రైల్వే గేట్ల వద్ద అండర్ పాస్/ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కొండ బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి గుడి ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నామని, 2.2 లక్షల నిధులు వెచ్చించనున్నామని తెలిపారు. ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం స్థల సేకరణ చేపట్టడానికి రూ.96 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పారిశ్రామికంగా నియోజకవర్గం అభివృద్ధి చెందనున్నదని, 40000 ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగోలు ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు, తహసీల్దార్ సురేష్, మండల టీడీపీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్. సుధీర్, ముత్తాల వెంకయ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, జనసేన నాయకులు వెంకటేష్, గ్రామ సర్పంచ్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వం.. మంచి ప్రభుత్వం

◆గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెల్లడి



గుడివాడ (చైతన్యరథం): ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వమని, మంచి ప్రభుత్వమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వ్యాఖ్యానించారు. సోమవారం గుడ్లవల్లేరు మండలంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము... ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన... ముందుగా వరద బాధిత గ్రామాల్లో పశువుల మేత కొరకు వెణుతురు మిల్లి గ్రామస్తులు టీడీపీ నాయకులు పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో సమకూర్చిన గడ్డి వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఎన్డీయే కూటమినేతలతో కలిసి ఎమ్మెల్యే రాము మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... కూటమి పార్టీకి 175 స్థానాలకు గానూ 164 ఎంఎల్‌ఏ సీట్లు ఇచ్చి గొప్ప విజయాన్ని అందించారని, అందుకు ప్రజల అంచనాలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజులలో అమలు చేసిన పథకాలు వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు... పెంచిన పింఛన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, 16,500 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, నైపుణ్యాభివృద్ధి సెంటర్ల ఏర్పాటు వంటి 5 ప్రధాన అంశాలపై తొలి సంతకాలు చేశారని ఎమ్మెల్యే రాము గుర్తు చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలులో భాగంగా వచ్చే దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నామన్నారు. తల్లికి వందనం పథకం అందించడంపై ఇప్పటికే సర్వే జరుగుతున్నట్లు తెలుపుతూ సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, డీటీ కనకదుర్గ, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, టీడీపీ నాయకులు జంగం మోహన్ రావు, పొట్లూరి రవి, చాపరాల బాలాజీ, కొడాలి రామరాజు, సాయన పుష్పవతి,వెనిగళ్ళ నాగేశ్వరరావు, పళ్లెం నరసింహారావు ,ఆడుసుమిల్లి రామ్మోహన్ రావు, గుడివాడ బిజెపి ఇన్చార్జ్ దావులూరి సురేంద్ర బాబు ,జనసేన నాయకులు చిన్న, పేర్ని జగన్ గుడ్లవల్లేరు మండల పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాల టీడీపీ నాయకులు, మండల ఎన్డీఏ కూటమి పార్టీల నేతలు, పెద్ద సంఖ్యలో ప్రజలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తునిలో యనమల దివ్య ఇంటింటి ప్రచారం

◆ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే

తుని (చైతన్యరథం): సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా నెరవేర్చే ఎన్డీయే కూటమి మున్ముందు మరిన్ని ప్రజా రంజక పథకాలు ప్రజల ముంగిటకు తీసుకొస్తుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గాది రాజబాబు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం నినాదంతో కోటనందూరు మండలం ఇండుగపల్లి, సూరపురాజుపేట, అప్పలరాజుపేట తదితర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే యనమల దివ్యకు ప్రజలు అఖండ స్వాగతం పలికారు. అక్కడ కూటమి వందరోజుల పాలనలో అమలు చేసిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజల వినతులను స్వీకరించిన ఆమె రామరాజు ఆయకట్టు పథకం అభివృద్ధి పరుస్తామని, స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గాది వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాది రాము, పంపనుబోయిన గంగరాజు, నక్కా రామకృష్ణ, జనపరెడ్డి శ్రీను, గూటాల అప్పారావు, మందపాటి వెంకటరమణ పాల్గొన్నారు. అనంతరం సూపర్ రాజుపేటలో పోతల సూరిబాబు గుడివాడ తాతబాబు సబ్బవరపు అప్పలనాయుడు, సుర్ల సూరిబాబు, తమరాన సత్తిబాబు అన్నం రెడ్డి ఎర్రి నాయుడు, టీ.అచ్చిరాజులు, గుడివాడ రాజు, తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదికకు ఎమ్మెల్యే యనమల దివ్య సీనియర్ నేతలు యనమల రాజేష్ సుర్ల లోవరాజు,మోతుకూరి వెంకటేష్ చింతంనీడి అబ్బాయి పాల్గొన్నారు.

## సంక్షోభంలోను సంక్షేమం, అభివృద్ధికి రెక్కలు

◆ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వనమాడి కొండబాబు

కాకినాడ (చైతన్యరథం): ఆర్థిక కష్టాలు ఉన్నా అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తోందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జగన్నాథపురం ఎన్టీఆర్ నగర్ నందు సోమవారం ఏర్పాటు చేసిన "ఇదీ మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమానికి



ముఖ్య అతిథులుగా కొండబాబు హాజరయ్యారు. ఆ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... జరిగిన వంద రోజుల్లో ఏం జరిగిందో జరుగుతుందో ప్రజలు కూడా తెలుసుకోవలసిన అవసరం ఉందని, గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తం అయిపోయాయని, వాటన్నిటిని గాడిలో పెడుతూ కూటమి ప్రభుత్వం అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని గాడిలో పెడుతుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేసిన మొట్టమొదటి పని పెంచి ఇస్తానన్న పెన్షన్ 3000 రూపాయల నుండి 4000 రూపాయలకి పెంచి ఏ నెల నుంచి అయితే ఇస్తాను అన్నారో ఆ మూడు నెలలు కలిపి మొత్తం 7000 రూపాయలు అందించారని, గత ప్రభుత్వం మీ ఆస్తిపై హక్కులను హరిస్తూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం తీసుకువచ్చిందని, తద్వారా ఆస్తి హక్కు పత్రాలను ప్రభుత్వ స్వాధీనంలో ఉంచుకుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ ఆస్తి హక్కులకు భంగం కలగకుండా యథావిధిగా కొనసాగించేలా ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసిందని, నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పైచిలుకు ఉపాధ్యాయ ఉద్యోగ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందని, పేద వాడికి ఐదు రూపాయలకే మంచి భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని, ఇది మంచి ప్రభుత్వం మనందరి ప్రభుత్వమని కొండబాబు అన్నారు.

### ఆదర్శవంతమైన పాలనకు ఏలూరును చిరునామాగా మార్చుతాం

◆బడేటి చంటి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

ఏలూరు (చైతన్యరథం): ఆదర్శవంతమైన పాలనకు ఏలూరును చిరునామాగా మార్చి అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తున్నానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు నగరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రతి డివిజన్‌లోనూ ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతోంది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ప్రజలతో మమేకమవుతూ కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేందుకు తమవంతు కృషిచేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం 19వ డివిజన్ ఎన్టీఆర్ కాలనీలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మేయర్ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్ళి వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి తీసుకున్న కార్యక్రమాలను వివరించారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను ప్రతి ఇంటికి అంటించడంతో పాటూ కరపత్రాలను పంపిణీ చేశారు.



# వరద బాధితులకు జగన్ ఏమి సాయం చేశాడో డాక్యుమెంట్ రూపంలో చూపించాలి

◆56వ డివిజన్‌లో

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

◆ఎమ్యూనరేషన్ పూర్తి..

గురువారం నుంచి నష్టపరిహారం

◆ఇది మంచి ప్రభుత్వం

అంటున్న 95% ప్రజలు

◆స్వచ్ఛందంగా ఇంటికి స్టిక్కర్లు

అంటించుకుంటున్న ప్రజలు

◆టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ (చైతన్యరథం): ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ఎమ్మెల్యే జగన్ ఇంకా రాజకీయాలు మాత్రమే చేస్తున్నాడు. జగన్ నీచ రాజకీయాలు ఆపేసి వాస్తవాలు గ్రహించి మాట్లాడాలి. అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు డాక్యుమెంట్ రూపంలో చూపిస్తున్నాం. అలాగే జగన్ వరద బాధితులకి ఏమి సాయం చేశాడో డాక్యుమెంట్ రూపంలో చూపించాలని ఎంపి కేశినేని శివనాథ్ డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గం 56 డివిజన్ ఓల్డ్ ఆర్.ఆర్.పేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీయే ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి, ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ ప్రజల నివాసాలకు అంటించారు. అలాగే



ప్రాంతంలోని సచివాలయాలను సందర్శించి అక్కడ సిబ్బంది, అధికారులకి వరద బాధితుల పేర్ల నమోదు విషయంలో ఎలాంటి అజాగ్రత్త వహించవద్దని, బాధితులందరి పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపి కేశినేని శివనాథ్ కొంతమంది స్థానికులతో రాష్ట్ర ప్రభుత్వ పనితీరు గురించి అడగ్గా వరద సాయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన సాయాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే అన్న క్యాంటీన్లు, ఒకేసారి వెయ్యి రూపాయిలు పెంచి పెన్షన్లు అందజేయటం గురించి చెప్పటంతో పాటు ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులందరికీ పనులు వుంటున్నట్లు తెలిపారు. కొంతమంది ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ నాయకుల దగ్గర నుంచి తీసుకుని వారింటికి వారే అంటించుకున్నారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించారన్నారు. పదిహేను రోజుల క్రితం వరదల్లో సీఎం చంద్రబాబుతో కలిసి ఈ ప్రాంతంలో పర్యటించిన విషయాన్ని గుర్తుచేశారు. వరద ముంపుకి గురైన నగరాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు 74 ఏళ్ల వయస్సులో అలుపు లేకుండా కష్టపడిన చంద్రబాబు నాయకత్వంలో మనందరం వుండటం అదృష్టమన్నారు.

వరద కారణంగా బురద మయమైన రోడ్లు, ఇళ్లు శుభ్రపర్చటమే కాకుండా ఇన్సూరెన్స్ క్లెయిమ్ దగ్గర నుంచి ఇంట్లో పాడైపోయిన ఎలక్ట్రిక్ వస్తువులు బాగు చేయించే పనులన్నీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. అధికారులు ఎమ్యూనరేషన్ కూడా పూర్తి చేయటం జరిగింది. గురువారం నుంచి బాధితులకి నష్టపరిహారం అందజేయటం జరుగుతుందని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలాంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొని పరిస్థితుల్ని సాధారణ స్థితికి తీసుకువస్తారనేది నగర ప్రజలు స్వయంగా చూశారన్నారు. ఇక వందరోజుల్లోనే ఎన్డీయే కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏన్నో మంచి పనులు చేయటం జరిగిందన్నారు. ఒకేసారి వెయ్యిరూపాయిలు పెంచి నాలుగు వేల రూపాయలు పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా ఒకటో తారీఖు జీతాలు తీసుకోని ప్రభుత్వ ఉద్యోగులు... ఎన్డీయే ప్రభుత్వంలో ఒకటో తేదీనే జీతాలు అందుకుంటున్నారన్నారు. నిరుద్యోగ యువతకు 16,437 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కి తొలి సంతకం చేశాదన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రజల ఆస్తుల మింగేసేందుకు తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించటం జరిగిందన్నారు. నిర్మాణ రంగాన్ని నిలబెట్టేందుకు ఉచిత ఇసుక విధానం తిరిగి అమల్లోకి తెచ్చిన విషయం గుర్తు చేశారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆకలి తీర్చేందుకు రెండు విడతలుగా అన్న క్యాంటీన్లు ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధినాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పతావుల్లాగా, వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షులు దూండీ రాకేష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరిముల్లా, పశ్చిమ నియోజకవర్గం నాయకులు సోలంకి రాజు, యేదుపాటి రామయ్య, రజావుల్లా, డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్, సందక సురేష్, షేక్ బడేషా, శ్యాంసుందర్ తదితర ఎన్డీయే కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి

◆ఎమ్మెల్యే గళ్ళా మాధవి

◆గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో

100 రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో 100 రోజుల ఎన్డీయే కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవావారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిలుపునిచ్చిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నదని, ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు వారు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గడిచిన 5 ఏళ్ళ కాలంలో ప్రజలు జగన్‌రెడ్డి అనే ఓ నియంత చేతిలో నలిగిపోయారని, కనీసం తమ సమస్యలు చెప్పుకోవటానికి ఓ ప్రజాప్రతినిధి కూడా కనిపించే వారు కాదని, నిరసన తెలుపుదామన్న కూడా తీవ్ర వేధింపులకు గురిచేసే వారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం చాలా విలువైనదని, నియంతలకు ఇక్కడ చోటులేదని మొన్న ఎన్నికల్లో ప్రజలు జగన్‌రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. జగన్ రెడ్డి ఘోర తప్పిదాల వలన వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయి, తీవ్ర ఆర్థిక కష్టాలు వెంటాడిన కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవంతో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం నుండి అందే జీతాలు, పెన్షనలు ఒకటో తేదీనే అందుతున్నాయని సంక్షేమం, అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని గళ్ళా మాధవి తెలిపారు. గడిచిన ఈ 5ఏళ్ళ కాలంలో రోడ్లు ధ్వంసం అయినా కూడా ప్యాచ్ వర్కులు కూడా చేయలేదని, కానీ నేడు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రోడ్లకు మరమ్మత్తులు మరియు కొత్త రోడ్ల నిర్మాణానికి పచ్చ జెండా ఊపిందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అయ్యిన నాటి నుండి నియోజకవర్గంలో అనేక చోట్ల సిసి రోడ్లు, డ్రైనేజి ప్రధాన రోడ్లుగా ఉన్న కలెక్టరేట్, మస్తాన్ దర్గా, శ్రీ బొమ్మల సెంటర్ ప్రాంతాలలో బిటి రోడ్ల నిర్మాణం చేశామని ఎమ్మెల్యే గళ్ళ మాదవి గుర్తు చేసారు. రాబోయే రోజుల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు,డ్రైనేజి సమస్యలు లేకుండా చూడటమే తన లక్ష్యం అని గల్లా మాధవి తెలిపారు.



# ఇది మంచి మనస్సు ఉన్న ప్రభుత్వం

◆వేమూరులో నక్కా ఆనందబాబు ఇంటింటి ప్రచారం

వేమూరు (చైతన్యరథం) : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అడ్డుగోలుగా రాష్ట్రాన్ని దోచుకున్నాడని, ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతూ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చేశారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పరిపాలన ఒక నియంతను తలపించిందని కాబట్టే ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలం యలవర్రు గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలు, స్టిక్కర్లు అంటించారు. అనంతరంవంద రోజుల కూటమి పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, వంద రోజుల్లో వందకు మించి మంచి పనులు చేసిన ప్రభుత్వ ఇదేనని ప్రజలే కొనియాడుతున్నారని అన్నారు. నాటి వైసీపీ పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. యువతకు చదువుతోపాటు ఉద్యోగ భరోసా కల్పించేందుకు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రాష్ట్రాన్ని 2047 విజన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజా నాయకుడిగా, సేవకుడిగా గుర్తింపు పొందారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. వాలంటీర్ వ్యవస్థ లేకపోతే పెన్షన్లు ఇవ్వలేరన్న వైసీపీ విష ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ నెలలో మొదటి రోజునే 100 శాతం పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. ఇసుకను ఉచితంగా అందించేందుకు నూతన పాలసీ తీసుకురావడం జరిగిందని, నాడు కల్తీ మద్యాన్ని సరఫరా చేసి వందలాది మంది ప్రాణాలను జగన్ రెడ్డి బలితీసుకున్నారని కల్తీ మద్యాన్ని పూర్తిగా అరికట్టామన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ ప్రభుత్వం ఘోరమైన తప్పుదాన్ని చేసిందని, కమీషన్ల కక్కుర్తితో కల్తీ నెయ్యిని కొనుగోలు చేసి మహా అపరాధాన్ని చేసిందన్నారు. తిరుమల శ్రీవారి ఆలయాన్ని వైసీపీ నాయకులు దోచుకున్నారని, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన వారికి శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చీరాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

◆పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య

చీరాల (చైతన్యరథం): నియోజకవర్గం మునిసిపాలిటీ 23వ వార్డు, రామన్నపేట పంచాయతీలలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం సాధించిన విజయాలు



అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి కరపత్రాలు పంపిణీతో పాటు స్టిక్కర్లు అంటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పెన్షన్లు రూ.4 వేలకు పెంచడం, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, స్కిల్ గణన వంటి పథకాలు ఇప్పటికే అమలు చేయగా... వచ్చే దీపావళీ నాటికి ఉచిత గ్యాస్ సిలెండర్ పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. విజయవాదలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యానికి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలను సురక్షితంగా కాపాడటంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చూపించిన చొరవ ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రావన్నపేట నందు నిరుపేద గర్భిణీ మహిళలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. రసాయనాలను వాడకుండా పండించిన కూరగాయలను ప్రదర్శించారు.

# ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత కుర్రాళ్లు.. సిరీస్ కైవసం!

ఆస్ట్రేలియా అండర్-19తో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లో భారత్ కుర్రాళ్లు దుమ్మురేపారు. భారత్ వేదికగానే జరుగుతున్న ఈ మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకున్నారు. పుదేచ్చరీ వేదికగా సోమవారం జరిగిన రెండో వన్డేలో సమష్టిగా రాణించిన భారత అండర్ 19 టీమ్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. పుదేచ్చరీ వేదికగానే జరిగిన తొలి వన్డేలోనూ 7 వికెట్లతో గెలుపొందింది.

రెండో వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 176 పరుగులకు కుప్పకూలింది. అడిసన్ షెరిఫ్(61 బంతుల్లో 2 ఫోర్లతో 39) టాప్ స్కోరర్‌గా నిలవగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత కుర్రాళ్లలో సమర్థ్ నాగ్‌రాజ్, మహమ్మద్ ఇనాన్, కిరణ్ కోర్మలే రెండేసి వికెట్లు తీయగా.. యుధజిత్ గుహ, హార్దిక్ రాజ్ తలో వికెట్ తీసారు.

అనంతరం భారత అండర్ 19 జట్టు 22 ఓవర్లలో వికెట్ నష్టానికి 177 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. సాహిల్ పరాఖ్(75 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్సులతో 109 నాటౌట్) అజేయ శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించగా.. అభిజ్ఞాన్ కుందు(53 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో హ్యారీ హెూక్సెట్రా ఏకైక వికెట్ సాధించాడు.

ఈ సిరీస్‌లో భారత కుర్రాళ్ల ముందు ఆసీస్ యంగ్ ప్లేయర్లు తేలిపోయారు. అప్‌కమింగ్ అండర్ 19 ప్రపంచకప్‌తో పాటు భవిష్యత్తు స్టార్లను వెలికి తీసేందుకు ఐసీసీ యూత్ వన్డే సిరీస్‌లను నిర్వహిస్తూ ఉంటుంది. భారత్ గడ్డపై మూడు వన్డేల సిరీస్‌తో పాటు రెండు అనధికారిక టెస్ట్‌లు ఆడేందుకు యంగ్ ఆస్ట్రేలియా ఇక్కడికి వచ్చింది.

ఇప్పటికే వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత కుర్రాళ్లు.. క్లీన్ స్వీప్‌పై గురిపెట్టారు. ఇరు జట్ల మధ్య మూడో వన్డే సెప్టెంబర్ 26న జరగనుంది.



## చరిత్ర సృష్టించిన బుమ్రా



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఈ ఏడాది మూడు ఫార్మాట్లలో అత్యధిక వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు. బంగ్లా దేశ్‌తో చెన్నై వేదికగా ఆదివారం ముగిసిన టెస్ట్‌లో 5 వికెట్లు తీయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లో ఓ కీలక వికెట్ పడగొట్టాడు.

దాంతో ఈ మ్యాచ్‌లో భారత్ 280 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో జాకీర్ హసన్‌ను ఔట్ చేయడం ద్వారా బుమ్రా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది మూడు ఫార్మాట్లలో కలిపి బుమ్రా 47 వికెట్లు తీసాడు. మొత్తం 14 మ్యాచ్‌లు 20 ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్ సాధించాడు.

ఈ జాబితాలో బుమ్రా తర్వాత హాంగ్ కాంగ్ బౌలర్ ఎహసన్ ఖాన్ ఉన్నాడు. 26 ఇన్నింగ్స్‌ల్లో 46 వికెట్లు తీసాడు. వానిందు హసరంగా 20 ఇన్నింగ్స్‌ల్లో 43 వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్ కూడా 23 ఇన్నింగ్స్‌ల్లో 43 వికెట్లు పడగొట్టాడు.

వచ్చే నాలుగు నెలల్లో టీమిండియా మరో 9 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా సెప్టెంబర్ 27 నుంచి రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ నుంచి బుమ్రాకు విశ్రాంతి కల్పిస్తారని ప్రచారం జరిగినా.. బీసీసీఐ అతన్ని రెండో టెస్ట్‌కు ఎంపిక చేసింది. కాన్పూర్ పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను తీసుకుంటే.. బుమ్రాను తుది జట్టు నుంచి తప్పించవచ్చు. బుమ్రాను ఆడించాలనుకుంటే మాత్రం మరో పేసర్ బెంచ్‌కు పరిమితమవుతాడు.

## పంత్ సెంచరీపై ప్రశంసలు కురిపించిన గిల్‌క్రిస్ట్



టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఈ యువ వికెట్ కీపర్.. రీ ఎంట్రీలో తన తొలి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో సత్తా చాటాడు. చెన్నై వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 124 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మూడో రోజు ఆటలో భాగంగా లంచ్ తర్వాత పంత్ ఈ తన సెంచరీ మార్క్ అందుకున్నాడు. పంత్ ఇన్నింగ్స్ లో 11 ఫోర్లు.. 4 సిక్సర్లున్నాయి. టెస్ట్ కెరీర్‌లో ఇది రిషబ్ కు ఇది ఆరో సెంచరీ. ఈ సెంచరీతో పంత్ పై ప్రశంసలు వర్షం కురుస్తుంది.

క్రికెట్ లో అత్యంత విధ్వంసకర బ్యాటర్లలో ఒకరైన ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ ఆడమ్ గిల్ క్రిస్ట్ టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ను ప్రశంసలతో ముంచెత్తాడు. క్రికెట్ చరిత్రలోనే పంత్ సెంచరీ గ్రేటెస్ట్ కంబ్యాక్ అని చెప్పుకొచ్చాడు. ఈ సందర్భంగా తనకు, పంత్ కు మధ్య ఉన్న పోలికలపై స్పందించాడు.' పంత్ తనకంటే దూకుడుగా ఆడతాడని.. ఎలాంటి భయం లేకుండా అతడు బ్యాటింగ్ చేసే విధానం నాకు బాగా నచ్చుతుందని ఈ ఆసీస్ దిగ్గజం తెలిపాడు. పంత్ కు ఎప్పుడు వేగం తగ్గించాలో.. ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలుసని చెప్పాడు.

రిషబ్ పంత్ 2022 డిసెంబర్ 30న రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఉత్తరాఖండ్కు వెళ్తుండగా.. రూర్కి వద్ద పంత్ కారు ప్రమాదానికి గురైంది. కారు రోడ్డు పక్కన రెయిలింగ్ను ఢీ కొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ సమయంలో చాకచక్యంగా వ్యవహరించిన పంత్.. కారు అద్దాలు పగులకొట్టుకుని బయటకు దూకి ప్రాణాలను రక్షించుకున్నాడు. 2024 లో ఐపీఎల్ తో క్రికెట్ లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు.ఈ క్రమంలో టీమిండియా టీ20, వన్డే, టెస్ట్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

### డబ్ల్యూటీసీ పాయింట్లలో

## ఆస్ట్రేలియా కొంపముంచిన బంగ్లాదేశ్




వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తు రేసు రసవత్తరంగా సాగుతోంది. ఓ జట్టు విజయం ఇతర జట్లపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్, శ్రీలంక వర్సెస్ న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లు కొనసాగుతున్న నేపథ్యంలో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో జట్ల స్థానాలు మారిపోయాయి. అగ్రస్థానంలో ఉన్న భారత్ తమ స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

కానీ మిగిలిన జట్లలో హైటెన్షన్ మొదలైంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్ వంటి స్ట్రాంగ్ టీమ్స్ ఫైనల్ బెర్తు అవకాశాల సమీకరణాలు మారుతున్నాయి. మొత్తంగా గత రెండు డబ్ల్యూటీసీలకు భిన్నంగా ఈసారి ఫైనల్ బెర్తు రేసు హెూరాహెూరీగా సాగుతోంది. తాజాగా బంగ్లాదేశ్‌పై భారత్ 280 పరుగులు, న్యూజిలాండ్‌పై శ్రీలంక 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడంతో...పాయింట్ల పట్టికలో టీమ్స్ ఆర్డర్ మారిపోయాయి.

నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ ఆరో స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ మూడు నుంచి జారి నాలుగో స్థానంలోకి వెళ్లింది. శ్రీలంక మూడో స్థానానికి దూసుకొచ్చింది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం భారత్ (71.67 %), ఆస్ట్రేలియా (62.50 %), శ్రీలంక (50 %), న్యూజిలాండ్ (42.85 %), ఇంగ్లండ్ (42.19 %), బంగ్లాదేశ్ (39.29 %), దక్షిణాఫ్రికా (38.89 %), పాకిస్తాన్ (19.05 %), వెస్టిండీస్ (18.52 %) వరుసగా ఉన్నాయి.

భారత్ జోరు చూస్తుంటే ముచ్చటగా మూడో సారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోవడం ఖాయంగా అనిపిస్తోంది. దీంతో మిగిలిన ఒక్క బెర్తు కోసమే మిగతా జట్లు పోటీపడుతున్నాయి. అయితే ఆసీస్ రెండో స్థానంలో ఉన్నప్పటికీ ధైర్యంగా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. భారత్‌తో టెస్టు సిరీస్‌ను కోల్పోతే ఆసీస్ ప్రమాదంలో పడినట్లే. ఆస్ట్రేలియా భారత్‌తో పాటు శ్రీలంకతో టెస్టు సిరీస్ ఆడనుంది.

సొంతగడ్డపై లంకను ఓడించడం అంత సులువుకాదు. మరోవైపు శ్రీలంక ప్రస్తుతం మూడో స్థానంలో ఉంది. ప్రస్తుతం జరుగుతున్న న్యూజిలాండ్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి, దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో సత్తాచాటితే శ్రీలంక ఆసీస్‌కు అత్యంత సమీపంగా నిలుస్తుంది. ఇక ఆఖర్లో సొంతగడ్డపై ఆస్ట్రేలియాపై పైచేయి సాధిస్తే లంక ఫైనల్ బెర్తు సంపాదించవచ్చు.

మరోవైపు ఆస్ట్రేలియా ఆశలను బంగ్లాదేశ్ తమ ఓటములతో ఆవిరిచేస్తుంది. పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్ గెలిచిన జోరుతో టీమిండియాకు బంగ్లాదేశ్ గట్టిపోటీ ఇస్తుందని, దాంతో తమ విజయశాతానికి రోహిత్ సేన దగ్గరవుతుందని ఆస్ట్రేలియా భావించింది. భారత్ గెలుపు శాతానికి సమీపంగా ఉంటే ఫైనల్ బెర్తు కన్ఫార్మ్ అవుతుందని భావించింది. కానీ బంగ్లా ఘోర ఓటమితో భారత్ విజయ శాతాన్ని భారీగా పెంచేస్తోంది. మొదటి స్థానాన్ని అందుకోవడానికి బదులుగా రెండో స్థానాన్ని కాపాడుకునే పరిస్థితి ఆస్ట్రేలియాకు తలెత్తింది.

## పూరన్ విధ్వంసం..

**6 ఫోర్లు, 7 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు!**






కరేబియన్ ప్రీమియర్ లీగ్ 2024లో నికోలస్ పూరన్ రెచ్చిపోయి ఆడుతున్నాడు. తన బ్యాట్ పవర్ ఏంటో మరోసారి బౌలర్లకు రుచి చూపించాడు. ప్రత్యర్థి పై ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ.. మెరుపు బ్యాటింగ్ చేశాడు. దాంతో ఈ టోర్నీలో ట్రిన్ బాగో నైట్ రైడర్స్ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇక పూరన్ దాటికి 194 పరుగుల లక్ష్యం కూడా చిన్నదైపోయింది. తన బ్యాటింగ్ తో పూనకాలు తెప్పించాడు.

నికోలస్ పూరన్.. ప్రపంచ క్రికెట్‌లో విధ్వంసానికి మరో పేరు. మరీ ముఖ్యంగా టీ20 ఫార్మాట్ లో పూరన్ రెచ్చిపోయే విధానం చూస్తే.. కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ప్రస్తుతం జరుగుతున్న కరేబియన్ ప్రీమియర్ లీగ్ 2024లో ట్రిన్ బాగో నైట్ రైడర్స్ కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు ఈ స్టార్ ప్లేయర్. ఇక ఈ లీగ్‌లో భాగంగా తాజాగా సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్ తో జరిగిన మ్యాచ్ లో తన విశ్వరూపాన్ని మరోసారి చూపించాడు. ఇక ఈ మ్యాచ్ లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పేట్రియాట్స్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. జట్టులో ఆంద్రీ ఫ్లెచర్ 61 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 93 రన్స్ చేశాడు. అతడికి అండగా.. కైల్ మేయర్స్ 30 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 రన్స్‌తో చెలరేగారు.

అనంతరం 194 పరుగుల భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన నైట్ రైడర్స్.. నికోలస్ పూరన్ మెరుపు బ్యాటింగ్ తో 18.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. పూరన్ ప్రత్యర్థి బౌలర్లపై ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఇతడు కేవలం 43 బంతుల్లోనే 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. పూనకాలు తెప్పించేలా బ్యాటింగ్ చేసి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. అతడికి తోడు జేసన్ రాయ్ 34 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 రన్స్ చేశాడు. కాగా.. ఈ విజయానికి ముందే నైట్ రైడర్స్ ప్లే ఆఫ్స్ బెర్త్ ను ఖరారు చేసుకుంది. ఈ టీమ్ తో పాటుగా సెయింట్ లూసియా కింగ్స్, గయానా అమెజాన్ వారియర్స్, బార్బడోస్ రాయల్స్ ఈ సీజన్ లో ప్లే ఆఫ్స్ కు చేరాయి. ఇక ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు అక్టోబర్ 1, 2, 4 తేదీల్లో జరగనున్నాయి. అక్టోబర్ 6న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



# టికెట్ లేని ప్రయాణికులకు చెక్

## ◆అక్టోబర్ 1 నుంచి ప్రత్యేక తనిఖీలు

న్యూఢిల్లీ: రాబోయే పండగల సీజన్ దృష్ట్యా టికెట్ లేని ప్రయాణికులకు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. అక్టోబర్ 1 నుంచి 15 వరకు, అక్టోబర్ 25 నుంచి నవంబర్ 10 వరకు టికెట్ లేని, అనధికారిక ప్రయాణికులను కట్టడి చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాలని 17 జోన్ల జనరల్ మేనేజర్లకు రైల్వేశాఖ లేఖ రాసింది. తనిఖీల నివేదికలను నవంబర్ 18 నాటికి పంపాలని పేర్కొంది. టికెట్ లేకుండా ప్రయాణించే వారిలో పోలీసులూ ఎక్కువగా ఉన్నట్లు రైల్వే కమర్షియల్ అధికారులు చెప్పారు. ఇటీవల ఘజియాబాద్- కాన్పూర్ సెక్షన్లో తనిఖీలు నిర్వహించగా.. వివిధ రైళ్లలోని ఏసీ కోచ్‌ల్లో వందలాది మంది పోలీసులు టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఆర్టీఐ వివరాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.61 కోట్ల మంది టికెట్ ఉల్లంఘనదారులు పట్టుబడగా, వారి నుంచి జరిమానా రూపేణా రూ.2,231 కోట్లను రైల్వే శాఖ వసూలు చేసింది.



# పిడుగుపాటుకు ఎనిమిది మంది మృతి

## ◆మృతుల్లో నలుగురు పాఠశాల విద్యార్థులు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర విషాద సంఘటన చోటు చేసుకుంది. పిడుగుపాటుకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు చిన్నారులు కూడా ఉండటం కలచివేస్తోంది. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని జోరటరాయ్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఎస్పీ మోహిత్ గార్గ్ తెలిపారు. పిడుగుపాటుకు నలుగురు పాఠశాల విద్యార్థులు సహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఒకరికి గాయాలైనట్లు అన్నారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించామన్నారు. ఈ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజ్‌నంద్‌గావ్‌లోని జోరటరాయ్ గ్రామంలో పిడుగుపాటుకు నలుగురు పాఠశాల విద్యార్థులు సహా ఎనిమిది మంది మరణించడం చాలా బాధాకరం అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ మేరకు సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, సరైన పరిహారం అందించాలని కోరారు.

# లోయలో పడ్డ బస్సు: నలుగురు మృతి

ముంబై: మహారాష్ట్ర సమీపంలోని మేలేఘాట్ వద్ద ప్రయాణికులతో వెళ్తున్న బస్సు సోమవారం లోయలో పడిపోయింది. ఈ సంఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాలపాలయ్యారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం.. అమరావతి సమీపంలోని మేలేఘాట్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రయాణికులతో అమరావతి నుంచి ధరణి వైపు వెళ్తోంది. ఉదయం 8:30 గంటల ప్రాంతంలో సేమడోహ సమీపంలోని ఘూత్‌ఖోరా ప్రాంతంలో ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు అదుపుతప్పి వంతెనపై నుంచి లోయలోకి పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.



# కాంగ్రెస్ దళితులకు వ్యతిరేకం

## ◆కుమారి షెల్జాను అవమానించింది

## ◆కేంద్ర హెూం మంత్రి అమిత్ షా విమర్శ

ఫతేహాబాద్: కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ అని, ఆ పార్టీ దళిత నాయకురాలైన కుమారి షెల్జాను అవమానించిందని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా విమర్శించారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా సోమవారం హర్యానాలోని ఫతేహాబాద్‌లో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో ప్రసంగించిన ఆయన కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ దళిత నేతలను అగౌరవపర్చడం దారుణమన్నారు.

రాహుల్ గాంధీ ఇటీవల అమెరికాలో 'దేశం అభివృద్ధి జరిగిన తర్వాత రిజర్వేషన్‌లు అవసరం లేదు.. వాటిని తొలగిస్తాం' అని అన్నారని, రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకమని ఆయన మాటలే చెబుతున్నాయని షా అన్నారు. కేవలం మోదీ మాత్రమే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన రిజర్వేషన్లను కాపాడగలరని అమిత్ షా స్పష్టం చేశారు. జమ్మూకాశ్మీర్ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీతోపాటు నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు కూడా ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని, ఉగ్రవాదులందరినీ విడుదల చేస్తామని చెప్పారని తెలిపారు.

'రాహుల్‌కి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే.. 'రాహుల్ బాబా మీకే కాదు.. మీ మూడోతరం వచ్చినా ఆర్టికల్ 370 తిరిగి రాదు' అని చెప్పాలనుకుంటున్నా. ఆర్టికల్ 370 ఇప్పుడు చరిత్రగా మారింది. మీ తాత కాలంలో ఆర్టికల్ 370 అనేది ఓ పెద్ద కృష్ణన్



మార్క్‌గా ఉంది. ఆ కృష్ణన్‌మార్క్‌ను నరేంద్ర మోదీ తొలగించేశారు. అది ఇక తిరిగిరాదు' అని షా వ్యాఖ్యానించారు. హర్యానా ఎన్నికలకు సంబంధించి మాట్లాడుతూ.. 'బీజేపీ పాలన ఎలా ఉంటుందో చెప్పడానికి హర్యానానే ఉదాహరణ అని అన్నారు.

గతంలో హర్యానాలో రెండు వేర్వేరు పార్టీలు అధికారంలోకి వస్తూ పోతుండేవి. ఒక పార్టీ అధికారంలోకి రాగానే అవినీతి పెరిగిపోయింది. మరో పార్టీ అధికారంలోకి రాగానే గూండాయిజం పెరిగింది. రెండు పార్టీల్లోనూ ఆశ్రిత పక్షపాతం, కులతత్వం తారాస్థాయికి చేరుకున్నాయి. ఇలాంటి సమయంలోనే హర్యానాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ బీజేపీ అధికారంలోకి రాకముందు ఉద్యోగం పొందాలంటే కచ్చితంగా ముడుపులు ముట్టజెప్పాల్సిందే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు' అని అమిత్ షా అన్నారు.

# ఆ కుర్చీ ఆయనకే సొంతం!

## ◆పక్కన వేరే కుర్చీలో..

## బాధ్యతలు చేపట్టిన ఢిల్లీ సీఎం అతిషి

న్యూఢిల్లీ: అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ముఖ్యమంత్రిగా 'ఆప్' నేత అతిషి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పార్టీ చీఫ్ కేజ్రీవాల్ కూర్చునే సీటును ఖాళీగానే ఉంచి, ఆ పక్కనే వేరే కుర్చీలో కూర్చుని విధులు నిర్వహించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా తాను ఈరోజు బాధ్యతలు చేపట్టానని, 14 ఏళ్ల పాటు రాముడు అరణ్యవాసం చేసిన సమయంలో అయోధ్య పాలన సాగించినప్పుడు భరతుడి మనోగతం ఎలా ఉందో తాను కూడా అలాంటి ఫీలింగ్‌తోనే ఉన్నట్టు చెప్పారు. రాముడి పాదుకలు సింహాసనంపై ఉంచి భరతుడు ఎలా పాలన చేశారో అదేవిధంగా రాబోయే నాలుగు నెలలు తాను ఢిల్లీ ప్రభుత్వ పాలన సాగిస్తానని తెలిపారు.

'కేజ్రీవాల్ తన రాజీనామాతో రాజకీయాల్లో హుందాగా ఎలా వ్యవహరించాలనే దానికి ఉదాహరణగా నిలిచారు. ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయడానికి బీజేపీ చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆయనపై తప్పుడు కేసులు బనాయించి ఆరు నెలల పాటు



జైలులో ఉంచింది. ఫిబ్రవరి ఎన్నికల్లో తిరిగి కేజ్రీవాల్‌ను ప్రజలు గెలిపించుకుంటారని నమ్ముతున్నాను. అప్పటివరకూ ఆయన సీటు ఖాళీగానే ఉంటుంది" అని అతిషి చెప్పారు.కేజ్రీవాల్ ప్రభుత్వంలో విద్య, రెవెన్యూ, ఆర్థికం, విద్యుత్, ప్రజాపనుల శాఖతో శాఖ 13 మంత్రిత్వ శాఖలను అతిషి నిర్వహించారు. ప్రస్తుతం కూడా ఆమె తన వద్దే ఆ శాఖలు ఉంచుకున్నారు. మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ చేతిలో ఏడు శాఖలు ఉన్నాయి. వీటిలో ఆరోగ్యం, పర్యాటకం, ఆర్ట్ అండ్ కల్చర్ శాఖలు కూడా ఉన్నాయి. గత మంగళవారం కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో శనివారం ఢిల్లీ కొత్త సీఎంగా అతిషి ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

# కలవరపెడుతున్న మంకీ పాక్స్

## ◆భారత్‌లో మూడో కేసు నమోదు

## ◆అప్రమత్తమైన కేంద్ర వైద్యారోగ్య శాఖ

న్యూఢిల్లీ: ప్రపంచదేశాల్లో కోరలు చాస్తున్న మంకీపాక్స్ భారత్‌లోనూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. దేశంలో సోమవారం మూడో మంకీపాక్స్ కేసు నమోదు అయింది. దీంతో భయాందోళన చెందాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దుబాయ్ నుంచి కేరళకు వచ్చిన వ్యక్తికి ఎం పాక్స్ లక్షణాలున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమానంతో పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. అతనికి మంకీపాక్స్ గ్రేడ్-1 బి వైరస్ నిర్ధారణ అయింది. ఇప్పటికే పలు దేశాలను కలవరపెడుతున్న మంకీపాక్స్ కేసుల సంఖ్య భారత్‌లోనూ క్రమంగా పెరుగుతోంది. కేసులు పెరుగుతున్న దృష్ట్యా కేంద్ర వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. విదేశాల నుంచి వచ్చే వారిలో ఎవరికైనా మంకీపాక్స్ లక్షణాలు కనబడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరింది. భారత్‌లో ఈనెల 9న తొలి కేసు, 18న రెండు, తాజాగా 23న మూడో కేసు నమోదైంది.

### మంకీపాక్స్ లక్షణాలు..

మంకీపాక్స్ ఇన్‌ఫెక్షన్ సాధారణంగా 2-4 వారాల పాటు ఉంటుందని, సపోర్టివ్ మేనేజ్‌మెంట్‌తో రోగులు




కోలుకుంటున్నారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలైంగిక సంపర్కం, గాయపడిన వ్యక్తితో ప్రత్యక్ష సంబంధం లేదా సోకిన వ్యక్తి దుస్తులు లేదా బెడ్‌షీట్‌లను ఉపయోగించడం ద్వారా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాలలో దానంతటదే తగ్గుతుంది. కానీ కొందరిలో ఇది తీవ్రంగా ఉంటుంది. ఇప్పటి వరకు ఈ వ్యాధికి వ్యాక్సిన్ లేదా సూచించిన మందులు లేవు. రోగికి అతని లక్షణాల ఆధారంగా మాత్రమే చికిత్స చేస్తారు. వైద్యులు యాంటీవైరల్ మందులు ఇవ్వడం ద్వారా వ్యాధిని నియంత్రిస్తారు.

చైతన్యరథం

# లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

**182 మంది మృతి, 700 మందికి గాయాలు - ఇళ్లను వదిలేయాలని హెచ్చరిక**



ఇజ్రాయెల్ జరిపిన భీకర వైమానిక దాడుల్లో లెబనాన్‌కు చెందిన 182 మంది మరణించారు. 700 మందికిపైగా గాయపడ్డారు. ఈ మేరకు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మరణించిన వారిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారని చెప్పింది. దక్షిణ, ఈశాన్య లెబానాన్ ప్రాంతాల్లో సోమవారం ఇజ్రాయెల్ దాడులకు పాల్పడిందని పేర్కొంది. అంతకుముందు, లెబనాన్‌లోని 300 హెజ్‌బొల్లా లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

**పెద్దఎత్తున పొగ**

ఆదివారం హెజ్‌బొల్లా తమ దేశంలో జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ దళాలు రాకెట్ల వర్షం కురిపిస్తున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడి చేసింది. ఈ దాడులతో సరిహద్దు ప్రాంతాల్లోని పలు పట్టణాల్లో పెద్దఎత్తున పొగ కమ్ముకుంది. హెజ్‌బొల్లాకు చెందిన 300 టార్గెట్‌లపై ఇజ్రాయెల్ సైన్యం వైమానికి దాడులు చేసింది. వైమానికి దళానికి చెందిన ఫైటర్ జెట్లు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ వెల్లడించింది.

**ఖాళీ చేయాలని హెచ్చరికలు**

హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థ స్థావరాలే లక్ష్యంగా దాడులను మరింత ఉధృతం చేయనున్నట్లు ఇజ్రాయెల్ సోమవారం ఉదయమే ప్రకటించింది. ఈ నేపథ్యంలో దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లోని ప్రజలు ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేసింది. హెజ్‌బొల్లా సంస్థ కొన్ని ఇళ్లను ఆయుధ క్షేత్రాలుగా ఉపయోగించుకుంటుందని తెలిపింది. వాటిని లక్ష్యంగా చేసుకుని మరిన్ని దాడులు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో అక్కడి వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని లెబనాన్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. దీంతో లెబనాన్ సరిహద్దు ప్రాంతాల్లో అలర్ట్ సైరన్లు మోగాయి.

115కు పైగా రాకెట్లను నాలుగు విడతలుగా ఉత్తర ఇజ్రాయెల్‌పై



హెజ్‌బొల్లా ఆదివారం ప్రయోగించింది. గతంలో ఎన్నడూ దాడి చేయని ప్రాంతాలనూ ఈసారి లక్ష్యంగా చేసుకుంది. లెబనాన్ సరిహద్దుకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైఫా నగరాన్నీ హెజ్‌బొల్లా రాకెట్లు తాకాయి. దీంతో ఉత్తర ఇజ్రాయెల్ వ్యాప్తంగా ఆదివారం పదే పదే సైరన్లు మోగాయి. బాంబు షెల్టర్లలో తలదాచుకొనేందుకు పౌరులు పరుగులు తీశారు. ఇందులో చాలా రాకెట్లను మధ్యలోనే ఐడీఎఫ్ నిరోధించినా కొన్ని ఉత్తర ఇజ్రాయెల్ వ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి.

## శ్రీలంక నూతన అధ్యక్షుడిగా అనురా కుమార్ దిసనాయకే ప్రమాణ స్వీకారం



కొలంబో: శ్రీలంక నూతన అధ్యక్షుడిగా అనురా కుమార్ దిసనాయకే సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి సచివాలయంలో ప్రధాన న్యాయమూర్తి జయంత జయసూర్య ఆయనతో ప్రమాణం చేయించారు. కాగా శ్రీలంకకు అనురాకుమార్ దిసనాయకే తొమ్మిదో అధ్యక్షుడు.

గత ఎన్నికల్లో కేవలం మూడు శాతం ఓట్లు మాత్రమే సాధించిన ఆయన.. ఈ ఎన్నికల్లో మార్పు, అవినీతి వ్యతిరేక సమాజ నిర్మాణం వంటి నినాదాలతో విస్తృతంగా ప్రచారం చేసి అపూర్వ జనాదరణ పొందారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాలను ఎత్తిచూపుతూనే జవాబుదారీతనం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

శ్రీలంక ఆర్థిక సంక్షోభం, రాజపక్సే రాజీనామా వంటి పరిణామాలతో ఏర్పడిన నాయకత్వ శూన్యత, ప్రజల్లో నిరుత్సాహం కమ్ముకొని ఉన్న పరిస్థితుల్లో వ్యవస్థలో మార్పు రావాలని కోరుకుంటున్న యువతను అవినీతి వ్యతిరేక వైఖరితో ఆకట్టుకున్నారు. ఆ విధంగా అవినీతిపై పోరాటమే ప్రచార అస్త్రంగా చేసుకొని 42.31 శాతం ఓట్లు సాధించి. సమీప ప్రత్యర్థి సాజిత్ ప్రేమదాస సమగి జన బలవేగయ (ఎస్ జెబి) పై సంచలన విజయం సాధించారు.

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శనివారం జరగ్గా.. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదట తొలి ప్రాధాన్య ఓట్లను లెక్కించినప్పటికీ.. అందులో విజయానికి అవసరమైన 50 శాతానికి పైగా ఓట్లు ఏ అభ్యర్థికీ రాలేదు. దీంతో గెలుపును నిర్ధారించేందుకు రెండో రౌండ్ కౌంటింగ్ చేపట్టారు. ఇందులో కుమార దిసనాయకే విజయం సాధించారు. మొత్తం 1.7 కోట్ల మంది నమోదిత ఓటర్లలో 75 శాతానికి పైగా ప్రజలు ఓటు వేశారు. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది.

**1987లో రాజకీయాల్లోకి..**

దిసనాయకే 1987లో మార్క్సిస్టు ప్రభావిత జనతా విముక్తి పెరమున (జేవీపీ) లో చేరి, తన రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. 1998 నాటికి పొలిట్‌బ్యూరోలో చోటు దక్కించుకున్నారు. 2000లో ఎంపీగా బాధ్యతలు చేపట్టారు. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేవీపీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. చంద్రికా కుమారతుంగ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించారు.

## 'మానవాళి విజయం యుద్ధభూమిలో లేదు'

**- ఐరాసలో మోదీ ప్రసంగం**



మానవాళి విజయం యుద్ధభూమిలో లేదు.. సమష్టి శక్తిలో ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ శాంతి, అభివృద్ధికిగాను అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవసరమన్నారు. న్యూయార్క్‌ని ఐరాస జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్'ను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ప్రపంచ భవిష్యత్తు గురించి అంతర్జాతీయ సమాజం చర్చిస్తున్న వేళ.. మానవ కేంద్రీకృత విధానాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో తన డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను మొత్తం ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు.

సుస్థిరాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే మానవ సంక్షేమం, ఆహారం, ఆరోగ్య భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చినట్లు తెలిపిన ఆయన.. తద్వారా సుస్థిరాభివృద్ధి విజయం సాధించవచ్చని నిరూపించామన్నారు. ఈ విజయ అనుభవాలను గ్లోబల్ సౌత్‌తో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు.

## చర్చనీయాంశంగా మారిన పేజర్ల పేలుళ్లు

లెబనాన్‌లో ఇటీవల వరుసగా పేజర్లు, వాకీటాకీలు పేలిపోయిన సంగతి తెలిసిందే. హెజ్‌బొల్లా సభ్యులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిణామాల వేళ ఇరాన్ ఎంపీ ఒకరు కీలక వ్యాఖ్యలు చేశారు. మే నెలలో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాద ఘటనను పేజర్ల పేలుళ్లతో ముడిపెట్టారు. రైసీ కూడా పేజర్ వినియోగించేవారని వెల్లడించారు.

"నాటి ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణించిన హెలికాప్టర్ కూడా.. ఆయన పేజర్ పేలడం వల్లే కూలిపోయి ఉండొచ్చు. రైసీ పేజర్‌ను వినియోగించేవారు. అయితే, హెజ్బుల్లా దళాలు ఉపయోగించే వాటితో పోలిస్తే ఇది భిన్నమైనదే. ఇక, హెజ్‌బొల్లా పేజర్ల కొనుగోళ్లలో ఇరాన్ దళాలు కీలక పాత్ర పోషించాయి. అందువల్ల రైసీ ఘటనపై మన నిఘా సంస్థలు ఈ కోణంలో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది" అని ఇరాన్ ఎంపీ అహ్మద్ ఆద్దెస్తానీ స్థానిక మీడియాతో పేర్కొన్నారు.

లెబనాన్‌లో సెప్టెంబరు 16-17 తేదీల్లో వరుసగా పేజర్లు, వాకీటాకీలు పేలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో 39 మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాది మంది గాయపడ్డారు. దీంతో పేజర్ల వినియోగం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే రైసీ పేజర్ వినియోగిస్తున్న ఫొటో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా ఇరాన్ ఎంపీ వ్యాఖ్యలతో మరింత ప్రాధాన్యం





సంతరించుకుంది.

ఈ ఏడాది మే నెలలో అప్పటి ఇరాన్ అధ్యక్షుడిగా ఉన్న రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇరాన్- అజర్‌బైజాన్ సరిహద్దుల్లో అధికారిక పర్యటనను ముగించుకొని తిరిగివస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ప్రమాదానికి గురైందని ప్రాథమికంగా నిర్ధరించారు. అయితే, ఈ ఘటన వెనక ఇజ్రాయెల్ హస్తం ఉండొచ్చనే ఆరోపణలూ వినిపించాయి.

## సెనెగల్ తీరంలో విషాదం

**పడవలో 30 మృతదేహాలు లభ్యం**

పశ్చిమాఫ్రికా దేశమైన సెనెగల్ తీరంలో తీవ్ర విషాదం వెలుగుచూసింది. దేశ రాజధాని డాకర్ తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంలో కొట్టుకుపోతున్న ఓ పడవలో 30 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. తొలుత నౌకాదళానికి ఆ పడవ గురించి సమాచారం అందిందని, ఈ క్రమంలోనే ఓ పెట్రోలింగ్ బోట్ను పంపగా.. ఈ విషాదం వెలుగుచూసినట్లు సెనెగల్ మిలిటరీ ప్రతినిధి ఇబ్రహీమా సౌ ఒక ప్రకటనలో తెలిపారు.



ఇప్పటివరకు 30 మంది మృతదేహాలు లెక్కించామని, కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో వారిని గుర్తించడం కష్టంగా మారిందన్నారు. ఆ పడవ ఎక్కడి నుంచి వచ్చిందో కనుగొనడంతోపాటు మృతుల సంఖ్యను నిర్ధారించే దిశగా విచారణను ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ నెల ప్రారంభంలోనూ సెనెగల్ తీరంలో ఓ వలసదారుల పడవ నీట మునిగి 37 మంది మృతి చెందారు.

ఘర్షణలు, పేదరికం, ఉద్యోగాల కొరత వంటి కారణాలతో పశ్చిమ ఆఫ్రికా నుంచి అనేక మంది వలసదారులు సెనెగల్ ద్వారా విదేశాలకు అక్రమంగా వలస వెళ్తుంటారు. చాలామంది సమీపంలోని స్పెయిన్‌కు చెందిన కానరీ దీవులకు పయనమవుతుంటారు. స్పెయిన్ అధికారుల వివరాల ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 22,300 మందికి పైగా వలసదారులు కానరీ దీవుల్లో అడుగుపెట్టారు. గత ఏడాది ఇదే వ్యవధితో పోలిస్తే 126 శాతం ఎక్కువ కావడం గమనార్హం.